


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 293 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 14 జూలై 2025 | పేజీలు : 12 | వెల : 2/-



## అమరావతిలో భూమిలేని పేదలకు పింఛన్ పునరుద్ధరణ

- రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ
- రాజధాని గ్రామాల్లోని 1,575 కుటుంబాలకు పింఛన్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- వైకాపా ప్రభుత్వం ఈ పింఛన్లను రద్దు చేసిన విషయం తెలిసిందే
- ఇటీవల జరిగిన మంత్రిమండలి భేటీలో పునరుద్ధరణకు ఆమోదం

**అమరావతి**

రాజధాని అమరావతిలో భూమి లేని పేదలకు పింఛన్‌ను పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాజధాని గ్రామాల్లోని 1,575 కుటుంబాలకు పింఛన్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. వైకాపా ప్రభుత్వం ఈ పింఛన్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన మంత్రిమండలి - మిగతా3లో

# సింగపూర్‌కు సీఎం చంద్రబాబు

- సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.
- అమరావతితోపాటు వివిధ జిల్లాలు, తీర ప్రాంత అభివృద్ధి కోసం పటిష్టమైన చర్యలు
- ఆ క్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులతోపాటు ఉన్నతాధికారుల బృందం జులై 26 నుంచి 30 వరకూ సింగపూర్‌లో పర్యటించనుంది.
- సింగపూర్‌లోని రాజకీయ, వ్యాపార వర్గాలతో ఈ బృందం సమావేశం కానుంది.



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఏపీ రాజధాని అమరావతితోపాటు వివిధ జిల్లాలు, తీర ప్రాంత అభివృద్ధి కోసం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులతోపాటు ఉన్నతాధికారుల బృందం జులై 26 నుంచి 30 వరకూ సింగపూర్‌లో పర్యటించనుంది. ఈ బృందంలో మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, టీజీ భరత్‌తోపాటు ఉన్నతాధికారులు కాటంనేని భాస్కర్, ఎన్.యువరాజ్, కార్తికేయ మిశ్రా, కన్నబాబు, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు నుంచి సాయికాంత్ వర్మ ఉన్నారు. సింగపూర్‌లోని రాజకీయ, వ్యాపార వర్గాలతో ఈ బృందం సమావేశం కానుంది. - మిగతా3లో



## అధిక ఉప్పు.. ఆరోగ్యానికి నిప్పు

- మోతాదుకు మించి వినియోగం
- ప్రతికూల ఫలితాలు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయి
- హైపర్‌టెన్షన్, స్ట్రోక్, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారిలో మరింత ముప్పు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా అధ్యయనం



## ఆర్పీఎఫ్ తొలి మహిళా సారథిగా సోనాలి మిశ్రా

- జూలై 31న పదవీ విరమణ చేయనున్న మనోజ్ యాదవ్ స్థానంలో ఆమె ఈ పదవిని చేపడుతున్నారు
- సోనాలి మిశ్రాను ఈ పదవిలో నియమించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ అధికారికంగా ఆమోదం
- సిబ్బంది మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం 2026, అక్టోబర్ 31 వరకూ అంటే పదవీ విరమణ చేసే వరకు సోనాలి మిశ్రా ఈ పదవిలో కొనసాగనున్నారు.



## వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు

- సీఎం నీతీశ్ కుమార్
- మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ప్రయత్నాలు మొదలు
- నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన
- 2025-2030 మధ్య కాలంలో కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం
- గతంలో ఇచ్చిన 50 లక్షల ఉద్యోగాల కల్పన హామీ దాదాపు పూర్తయింది

# ఏపీలో అప్రకటిత ఎమర్జెన్సీ.. టీడీపీ నేతలకు పోలీసుల వత్తాసు



- 'రాష్ట్రంలో చంద్రబాబు డైరెక్షన్‌లో పోలీసు రాజ్యాంగం నడుస్తోంది
- శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులే ప్రభుత్వం పెద్దలకు వత్తాసు పలుకుతున్నారు
- ఏపీలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది. ఏపీలో ప్రజాస్వామ్యం లేదు.
- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నాగమల్లేశ్వరరావుపై హత్యాయత్నం చేశారు.

**గుంటూరు**

ఏపీలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని ఆరోపించారు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి. రాష్ట్రంలో చంద్రబాబు డైరెక్షన్‌లో పోలీసు రాజ్యాంగం నడుస్తోందన్నారు. టీడీపీ నేతలు దాడులు చేస్తే పోలీసులే ప్రొటెక్ట్ ఇస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో చంద్రబాబు డైరెక్షన్‌లో పోలీసు రాజ్యాంగం నడుస్తోంది. శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులే ప్రభుత్వం పెద్దలకు వత్తాసు పలుకుతున్నారు. ఏపీలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోంది. - మిగతా3లో



## జగన్, పేర్నినానికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదు


- మంత్రి కొల్లు రవీంద్ర స్ట్రాంగ్ వార్నింగ్
- బీసీ మహిళను అడ్డం పెట్టుకుని ఆ ప్రాంతంలో కుట్రకు పేర్నినాని పాల్పడుతున్నారని మండిపడ్డారు
- రాక్షస మూకలకు రాక్షస ఆలోచనలే వస్తాయని జగన్, పేర్నినాని మరోసారి నిరూపించారు
- మాజీ మంత్రి వివేకా హత్యలో జగన్‌పై ఆరోపణలు వచ్చాయి
- వివేకాది గుండెపోటు కాదని.. గొడ్డలి వేటు అని ఆయన కుమార్తె తేల్చింది



## కేరళ సీఎం నివాసానికి బాంబు బెదిరింపు!

- గుర్తుతెలియని వ్యక్తులు తంపనూరు పోలీస్ స్టేషన్‌కు మెయిల్
- క్లిఫ్ హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయని ఆ ఈ-మెయిల్
- తనిఖీల సమయంలో సీఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారు.

## కోట శ్రీనివాసరావుకు చివరి వీడ్కోలు



- మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు
- గత కొంతకాలంగా వయో వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న తుదిశ్వాస విడిచారు.
- సినీ, రాజకీయ ప్రముఖులు కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు

# వలంటీర్ల వ్యవస్థపై కేడర్ గుర్రు



- 2019 ఎన్నికల్లో తొలి సారి అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ తీసుకున్న అనేక నిర్ణయాలు ఆయన ఓటమికి కారణాలయ్యాయి
- అందుకే గతంలో తీసుకున్న నిర్ణయాలు మళ్లీ అధికారంలోకి వస్తే అమలుచేయబోనన్న హామీ జగన్ నుంచి స్పష్టంగా రావాల్సి ఉంటుంది
- అప్పటి వరకూ కార్యకర్తలు, లీడర్లు వచ్చినప్పటికీ ఇంకా రెట్టించిన ఉత్సాహంతో మాత్రం పనిచేయరు.
- ఎమ్మెల్యేలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశాడు
- అసలు ఎమ్మెల్యేలకు, ప్రజలకు మధ్య సంబంధం లేకుండా జగన్ తానే ఒంటిచేత్తో రాష్ట్రాన్ని నడిపించాలన్న బిల్డప్ ఇచ్చేశాడు

**గుంటూరు**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలను వెనక్కు తీసుకుంటానని ముందు చెప్పాల్సి ఉంటుంది. అప్పుడే నేతల్లో కాస్త ధైర్యం కలుగుతుంది. 2019 ఎన్నికల్లో తొలి సారి అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ తీసుకున్న అనేక నిర్ణయాలు ఆయన ఓటమికి కారణాలయ్యాయి. అందుకే గతంలో తీసుకున్న నిర్ణయాలు మళ్లీ అధికారంలోకి వస్తే అమలుచేయబోనన్నహామీ జగన్ నుంచి స్పష్టంగా - మిగతా3లో

# ఏపీలో అప్రకటిత ఎమర్జెన్సీ..
# టీడీపీ నేతలకు పోలీసుల వత్తాసు

-మొదటిపేజీ తరువాయి

ఏపీలో ప్రజాస్వామ్యం లేదు. టీడీపీ నేతలు దాడులు చేస్తే పోలీసులే ప్రొటెక్ట్ ఇస్తున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నాగమల్లేశ్వరరావుపై హత్యాయత్నం చేశారు. నాగమల్లేశ్వరరావు ప్రాణాలతో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్నారు. సర్పంచ్ నాగమల్లేశ్వరావు కోలుకుంటారని ఆశిస్తున్నాను. మృత్యుంజయుడిగా బయటకు వస్తాడని భావిస్తున్నాను. నాగమల్లేశ్వరరావు పైన జరిగిన దాడి రాజకీయపరమైన హత్యాయత్నం. దాడికి సంబంధించిన సీసీ కెమెరా విజువల్స్ భయానకంగా ఉన్నాయి. అంబటి మురళి పైనే కేసు నమోదు చేశారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం అవుతుంది. దాడికి రెచ్చగొట్టేలా మాట్లాడిన ధూళిపాళ్లపై కేసు పెట్టలేదు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తుంది. వైఎస్సార్‌సీపీ నేతల పైనే దాడులు చేయమని నేరుగా చెబుతున్నారు. నాగమల్లేశ్వరావుపై దాడి చేసిన నిందితులకు సన్మానం చేసినా చేస్తారు. పెదకూరపాడు మాజీ ఎంపీపీని ఏడాది క్రితం దారుణంగా కొట్టారు. నెల్లూరులో ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై దాడి చేస్తున్నా పోలీసులు పట్టించుకోలేదు. ప్రసన్న కుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేస్తే చర్యలేవి?. గుడివాడలో జడ్పీ చైర్‌పర్సన్‌పైన దాడి జరుగుతుంటే పోలీసులు అక్కడే ఉన్నాడు అడ్డుకోలేదు. ప్రజాస్వామ్యయుతమైన హక్కులను



వైఎస్సార్‌సీపీ నేతల్ని వినియోగించుకోనివ్వడం లేదు. రాష్ట్రం పోలీస్ రాజ్యంగా మారిపోయింది. వైఎస్ జగన్ ఇప్పటివరకూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయలేదు. జగన్ పర్యటనకు వచ్చినప్పుడల్లా వందల్లో కేసులు నమోదు చేస్తున్నారు. మామిడి రైతుల సమస్యలను తెలుసుకోవడానికి వెళ్తే మామిడి యార్డు మూసివేశారు. చంద్రబాబు ఆధ్వర్యంలో నడుస్తున్న పోలీసు రాజ్యం ఇది. ఎన్నికల్లో తీర్పు ఇవ్వాల్సింది ప్రజలే. అందుకే ప్రజలకు చెబుతున్నాం. వైఎస్సార్‌సీపీని చంద్రబాబు దుర్మార్గంగా అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. మా పార్టీ నాయకుల్ని, కార్యకర్తలని మానసికంగా వేధిస్తున్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తే జగన్ ఎందుకు బయటకొస్తారు. మిర్చి రైతుల కంట కన్నీరు కారుతుంది. ప్రైవేటు కేసు వేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

**ప్రాణాలతో పోరాడుతున్నాడు నాగ మల్లేశ్వరరావు ని పరామర్శించిన సజ్జల**

రైతులు పైన రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని ఎస్పీ అంటున్నాడు. ఆయన పోలీసా లేక రాజకీయనాయకుడా?. ఈ రాష్ట్రంలో ఎమర్జెన్సీ ఏమైనా విధించారా అంటే అది లేదు. మమ్మల్ని ఇబ్బందులు పెట్టిన కొద్దీ మేము రాటు తేలేలా చంద్రబాబు చేస్తున్నారు. చంద్రబాబు ఎప్పుడూ ప్రజలను పట్టించుకోలేదు. అందుకే ఆయనొస్తే పది మంది బయటకు రావటం లేదు. వ్యవస్థల్ని మేనేజ్ చేయడం చంద్రబాబుకు అలవాటు. ప్రజల గురించి ఆలోచించడం జగన్‌కు అలవాటు. అందుకే జగన్ పర్యటనలకు పెద్ద ఎత్తున ప్రజలు వస్తున్నారు. టీడీపీ నేతలు బరితెగించి దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేసు నమోదు చేయలేదు. దాడులపై వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేస్తే ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోవడం లేదు. రాష్ట్రంలో ఏ వర్గం సంతృప్తిగా లేదు. మామిడి, పొగాకు, మిర్చి రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు' అని చెప్పుకొచ్చారు.

# సింగపూర్‌కు సీఎం చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి

నగర ప్రణాళిక, నగర సుందరీకరణ, ఉద్యానవనాలు, ఓడరేవులు, మౌలిక వసతుల కల్పనతోపాటు భవిష్యత్ సాంకేతికతను అంది పుచ్చుకోవడం తదితర అంశాలపై చంద్రబాబు సారథ్యంలోని ఈ బృందం.. సింగపూర్‌లోని వివిధ రంగాల ప్రముఖులతో చర్చించనుంది. ఈ పర్యటన వివరాలను తెలుపుతూ.. పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయింది. దీంతో రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మిగిలిపోయింది. అదే సమయంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం కొలువు తీరింది. దీంతో రాష్ట్ర రాజధానిగా గుంటూరు జిల్లాలోని తుళ్లూరు, వెలగపూడి తదితర 29 గ్రామాలను రాజధాని ప్రాంతంగా ఎంపిక చేసింది. ఈ ప్రాంతానికి రాజధాని అమరావతిగా పేరు పెట్టారు. ఈ రాజధాని నిర్మాణం కోసం అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు.. నాటి సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందాలు సైతం చేసుకున్నారు. అనంతరం 2019లో



జరిగిన ఎన్నికల్లో వైసీపీని ప్రజలు గెలిపించారు. దీంతో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే అంతకుముందు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్.. రాజధాని అమరావతికి మద్దతు ప్రకటించారు. అది కూడా అసెంబ్లీ సాక్షిగా. కానీ సీఎంగా ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత మాట, మడం రెండూ తిప్పేశారు. దీంతో ఏపీకి మూడు రాజధానులంటూ అదే అసెంబ్లీ సాక్షిగా కీలక ప్రకటన చేశారు. అలాగే గత టీడీపీ ప్రభుత్వం, సింగపూర్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేశారు. జగన్ ప్రకటనతో రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులు ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు చేపట్టారు. దాదాపు కొన్ని నెలల పాటు వారు ఈ విధంగా చేశారు. వీరిపై నాటి జగన్ ప్రభుత్వం అత్యంత కర్కశంగా వ్యవహరించింది. ఇంతలో 2024లో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. ఈ ఎన్నికల్లో కూటమికి ఏపీ ఓటర్ పట్టం కట్టారు. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో రాజధాని అమరావతి పనులు పున:ప్రారంభమయ్యాయి. అలాంటి వేళ.. సీఎం చంద్రబాబు నాయుడు తన కేబినెట్ సహచరులతోపాటు ఉన్నతాధికార ప్రతినిధి బృందంతో సింగపూర్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన ముగించుకుని జులై 30న తిరిగి అమరావతికి రానున్నారు

# బాండ్లు.. బాబు, పవన్ మోసం ప్రజలకు తెలియాలి

చిత్తూరు: ఏపీలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితి లేదన్నారు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుది అని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన మోసాలు ప్రతీ గ్రామానికి తీసుకుని వెళ్ళాలి అని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు మున్సిపాలిటీ, పుంగనూరు, చౌడేపల్లె, సోమల మండలాల్లో వైఎస్సార్‌సీపీ అధినేత, వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ..'చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ మాత్రమే కాకుండా 143 హామీలు ఇచ్చారు. ప్రతీ ఇంటికి ఇంత ఇస్తాం.. అంత ఇస్తాం అని టీడీపీ ప్రచారం చేసింది. వాటితో పాటుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్



సంతకాలు పెట్టి బాండ్లు ఇచ్చారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన మోసాలు ప్రతీ గ్రామానికి తీసుకుని వెళ్ళాలి. ప్రతీ ఇంటికి వీరి మోసాలు తెలియాలి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితి లేదు. వైఎస్ జగన్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్నారు. కరోనా సమయంలో కూడా ఎక్కడా వైఎస్ జగన్ వెనకడుగు వేయలేదు. కానీ, కూటమి ప్రభుత్వం ఏడాదిలోపు చెడ్డ పేరు తెచ్చుకుంది. మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుది. గతంలో రామారావును వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయిన వెంటనే చంద్రబాబు మద్యపాన నిషేధాన్ని ఎత్తేశారు. కరెంట్ ఛార్జీలు పెంచమని రామారావు హామీ ఇస్తే.. ఆ మాటను కూడా తుంగలో తొక్కి ఐదుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. 2014లో కూడా అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు మళ్ళీ ఇచ్చిన హామీలు పక్కన పెడుతున్నారు. తల్లికి వందనానికి 13వేల కోట్లు అవసరమైతే కేవలం ఎనిమిది వేల కోట్లు మాత్రమే నిధులు కేటాయించారు. ఇక ఉచిత బస్సు అని చెప్పి అది స్థానికంగా మాత్రమే అని మెలికలు పెట్టారు.. అది కూడా ఇంకా అమలు కాలేదు. ఇవన్నీ కూడా మీరు ప్రజలకు గ్రామ గ్రామానా వివరించాలి' అని పిలుపునిచ్చారు.

# రైళ్లు రాకుండా అడ్డుపడుతున్న ట్రావెల్స్...
# వృధాగా మారిన కోచింగ్ డిపో...

**విజయవాడ :** స్వప్రయోజనాల కోసం ప్రజా ప్రయోజనాలను ఫణంగా పెట్టడం విజయవాడ రాజకీయానికే చెల్లుతుంది. అన్నీ సిద్ధంగా ఉన్నా వందే భారత్ రైలును మంజూరు చేయకుండా స్థానిక రాజకీయం అడ్డ పడుతోంది. ఏడాదిన్నర క్రితమే వందే భారత్ ర్యాక్ మెయింటెయినెన్స్ డిపో సిద్ధమైనా, సాంకేతిక సమస్యలు, రైళ్లు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది.స్వప్రయోజనాల ముందు ప్రజల సమస్యలు, అవసరాలు పట్టవని విజయవాడ రాజకీయం రుజువు చేసింది. దేశంలోని అన్ని ప్రధాన నగరాలు తమకు వందే భారత్ రైళ్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తుంటే విజయవాడ కేంద్రంగా నడిచే రాజకీయం మాత్రం రైళ్లు రాకుండా అడ్డ పడుతున్నాయి. ఎప్పుడో రావాల్సిన వందే భారత్‌కు ఆటంకాలు సృష్టిస్తున్నాయి.విజయవాడ నుంచి బెంగుళూరుకు డైరెక్ట్ ట్రైన్స్ లేవు. పైనుంచి వచ్చే రైళ్లలో విజయవాడ కోటా పెద్దగా ఉండదు. దీంతో టిక్కెట్లు దక్కడం దాదాపు అసాధ్యం. దీంతో విజయవాడ బెంగుళూరు మధ్య ట్రావెల్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది. నిత్యం పెద్ద సంఖ్యలో ట్రావెల్స్ బస్సులు బెంగుళూరుకు నడుస్తుంటాయి. సాయంత్రం ఆరు నుంచి రాత్రి 9 గంటల మధ్యలో విజయవాడ వారధి నుంచి పెద్ద సంఖ్యలో బెంగుళూరుకు ట్రావెల్స్ బస్సులు నడుస్తుంటాయి. 12 -13 గంటల ప్రయాణ సమయమైనా ఈ బస్సుల్లో టిక్కెట్లకు ఎప్పుడు డిమాండ్ ఉంటుంది.విజయవాడ నుంచి బెంగుళూరుకు వందే భారత్ రైలు వస్తే ట్రావెల్స్ వ్యాపారానికి గండి పడుతుంది. ప్రస్తుతం ఉన్న 13-14 గంటల ప్రయాణం 9 గంటలకు తగ్గిపోతుంది. ఇప్పటికే రైళ్ల రాకపోకల షెడ్యూల్‌ను కూడా ఖరారు చేశారు. గత మేలోనే వందే భారత్‌కు పాలనాపరమైన అనుమతులు లభించగా, ట్రైన్ సర్వీస్ జూన్‌లో మొదలు కావాల్సిఉంది. విజయవాడ నుంచి తిరుపతి మీదుగా 9గంటల్లోనే బెంగుళూరు చేరుకునేలా ప్రయాణ సమయాన్ని ఖరారు చేశారు.వందే భారత్‌కు రైల్వే బోర్డు అనుమతించగానే ట్రావెల్స్ వ్యాపారులు రాజకీయ నేతల్ని ఆశ్రయించారు. తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఒత్తిడి చేయడంతో వందే భారత్‌కు అనుమతి రాలేదు. ప్రస్తుతం హైదరాబాద్-విశాఖపట్నం మధ్య విజయవాడ మీదుగా రెండు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. త్వరలోనే విజయవాడ నుంచి బెంగుళూరుకు మరో సర్వీసును ప్రారంభించేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది.ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను విజయవాడలో చేశారు.విజయవాడ నుంచి బెంగుళూరు వందే భారత్ జాప్యం కావడంపై రైల్వే వర్గాల నుంచి విశ్వసనీయ సమాచారం ప్రకారం స్థానిక రాజకీయాలే కారణంగా తెలుస్తోంది. ఈ ఏడాది రైల్వే బడ్జెట్ రూపకల్పన సమయంలో జీఎంతో ఏపీకి చెందిన ఎంపీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డివిజన్ల వారీగా అందరి నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. ఈ క్రమంలో బెంగుళూరుకు డైరెక్ట్ రైళ్ల ఏర్పాటు అంశం కూడా ప్రస్తావనకు రావడంతో దానిని పక్కన పెట్టాల్సిందిగా ప్రజా ప్రతినిధులు సూచించడంతో రైల్వే అధికారులు విస్తుబోయారు.విజయవాడ నుంచి బెంగుళూరు వైపు పరిమిత సంఖ్యలో రైళ్లు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.విజయవాడ నుంచి ప్రస్తుతం యశ్వంతపూర్ రైలు మాత్రమే బెంగుళూరుకు ఉంది. విజయవాడ మీదుగా ప్రయాణించే ఇతర జోన్ల రైళ్లలో డివిజన్ కోటా సీట్లు ఉండవు. దీంతో విజయవాడ నుంచి బెంగుళూరు వెళ్లాలనుకునే సగటు ప్రయాణికులకు సీట్లు దక్కే పరిస్థితి లేదు.దశాబ్దాలుగా విజయవాడ నుంచి బెంగుళూరుకు డైరెక్ట్ ట్రైన్ వేయకపోవడానికి ట్రావెల్స్ రాజకీయమే కారణమని రైల్వే వర్గాలు స్పష్టం చేశారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సుల వ్యాపారాన్ని కాపాడేందుకే ప్రజా ప్రతినిధులు కొత్త రైళ్లను రాకుండా అడ్డుపడుతున్నట్టు తెలుస్తోంది. సుదీర్ఘ ప్రయత్నాలు, రైల్వే అధికారుల చొరవతో కొత్త రైలును తిరుపతి మీదగా బెంగుళూరుకు నడిపేందుకు రైల్వే శాఖ అనుమతించినా మళ్లీ రాజకీయం అడ్డుపడింది.

## అమరావతిలో భూమిలేని పేదలకు పింఛన్ పునరుద్ధరణ



-మొదటిపేజీ తరువాయి

భేటీలో పునరుద్ధరణకు ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలోనే రాజధాని నిర్మాణంలో జీవనోపాధి కోల్పోయిన కుటుంబాలకు పింఛన్లను మంజూరు చేస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2015లో జరిపిన ఇంటింటి సర్వే ఆధారంగా 1,575 కుటుంబాలు పింఛన్లకు అర్హులుగా గుర్తించారు. మరోవైపు నేలపాడులో ప్రజాప్రతినిధులు, అధికారుల క్వార్టర్స్ పెండింగ్ పనుల పూర్తికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.524.70 కోట్ల నిధులు మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. 18 టవర్లలో 432 అపార్ట్‌మెంట్ యూనిట్ల నిర్మాణం జరుగుతోంది.

## జగన్, పేర్నినానికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదు..

**అమరావతి:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పేర్నినానిపై ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ మహిళను అడ్డం పెట్టుకుని ఆ ప్రాంతంలో కుట్రకు పేర్నినాని పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇవాళ(ఆదివారం) అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పల హారిక కారును వదిలేశామని తెలిపారు. కానీ తర్వాత ఆమె కావాలని వెనక్కి వచ్చి పోలీసులపై, తెలుగుదేశం నాయకుల గురించి అభ్యంతరకరంగా మాట్లాడారని స్థానికులే చెబుతున్నారని అన్నారు. జగన్, పేర్ని నానిలాంటి నెత్తుటి రాజకీయాలు చేసే వ్యక్తులకు రాజకీయాల్లో ఉండే అర్హత లేదని విమర్శించారు మంత్రి కొల్లు రవీంద్ర. రాక్షస మూకలకు రాక్షస ఆలోచనలే వస్తాయని జగన్, పేర్నినాని మరోసారి నిరూపించారని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. మాజీ మంత్రి వివేకా హత్యలో జగన్‌పై ఆరోపణలు వచ్చాయని అన్నారు. వివేకాది గుండెపోటు కాదని.. గొడ్డలి వేటు అని ఆయన కుమార్తె తేల్చిందని గుర్తుచేశారు. జగన్ ప్రతి విషయంలో రాద్ధాంతం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీ సభ పెట్టుకోవాలనుకున్నావ్. పెట్టుకో..... అంతే గానీ ఆ సభను అడ్డం పెట్టుకుని ఆ ప్రాంతంలో రక్తం పారిస్తానంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని జగన్, పేర్నినానిని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

**పేర్నినాని రెచ్చగొడుతున్నారు: ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్**

బావ కళ్లల్లో ఆనందం చూడాలని ఆ నాడు మొద్దు శ్రీను పరిటాల రవిని చంపితే... ఇప్పుడు జగన్ రెడ్డి కళల్లో ఆనందం చూడాలని పేర్ని నాని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మండిపడ్డారు. ఇవాళ(ఆదివారం) కృష్ణప్రసాద్ అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలాగేనా మాట్లాడేదని ప్రశ్నించారు. పేర్ని నాని పేదల బియ్యం దోచుకున్నారని ఆరోపించారు. చీకటిలో చంపేయండి... నరికేయండి అని వైసీపీ కార్యకర్తలను పేర్ని నాని రెచ్చగొడుతున్నారని ఫైర్ అయ్యారు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్. పేర్ని నాని ఎవరిని చంపుతారు.. టీడీపీ కార్యకర్తలనా? అని నిలదీశారు. గత వైసీపీ పాలనలో హింస రాజకీయం చేశారని... ఇప్పుడు అలానే చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ సైకో పాలన చూసి ప్రజలు 11 సీట్లు ఇచ్చారని... అయినా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని మండిపడ్డారు. ఏపీలో హింసను ప్రేరేపించేలా పేర్ని నాని మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంపై బురద జల్లాలని పేర్ని నాని విశ్వప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జగన్ అన్ని వ్యవస్థలను నాశనం చేశారు.. హోం మంత్రి అనిత ఫైర్

**అనకాపల్లి జిల్లా:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాలు వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలను నాశనం చేశారని మండిపడ్డారు. జగన్ హయాంలో ఏపీ ఎంతో నష్టపోయిందని విమర్శించారు. యస్ రాయవరం మండలం రామయ్యపట్నం గ్రామంలో హోం మంత్రి అనిత పర్యటించారు. రామయ్యపట్నంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రామయ్యపట్నం గ్రామంలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. ఏపీలో ఇప్పుడు ఎన్నికలు లేవని.. ప్రజల యోగక్షేమాలని తెలుసుకోవడానికే తాను రామయ్యపట్నం వచ్చానని చెప్పుకొచ్చారు. ఎన్ని కష్టాలు ఉన్నా, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రారంభమవుతుందని..త్వరలోనే నిరుద్యోగ భృతి అమలు చేస్తామని నొక్కిచెప్పారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్నవారందరికీ సంక్షేమ పథకాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు హోం మంత్రి అనిత. రామయ్యపట్నం గ్రామంలో తీర్మానాలు ఇవ్వకపోవడంతోనే ఈ గ్రామం అభివృద్ధిలో వెనుకంజలో ఉందని అన్నారు. రామయ్యపట్నం గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని మాటిచ్చారు. పార్టీలకు అతీతంగా రామయ్యపట్నం అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో టాయ్ పరిశ్రమ వస్తే, 25 వేల మంది మహిళలకు ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు.జిల్లాకు స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్ వస్తే ..పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వస్తాయని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

## వలంటీర్ల వ్యవస్థపై కేడర్ గుర్రు

-మొదటిపేజీ తరువాయి

రావాల్సి ఉంటుంది. అప్పటి వరకూ కార్యకర్తలు, లీడర్లు వచ్చినప్పటికీ ఇంకా రెట్టించిన ఉత్సాహంతో మాత్రం పనిచేయరు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు పార్టీ నేతలతో పాటు కార్యకర్తలను కూడా ఐదేళ్ల పాటు ఇబ్బంది పెట్టాయి. ఎమ్మెల్యేలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశాడు. అసలు ఎమ్మెల్యేలకు, ప్రజలకు మధ్య సంబంధం లేకుండా జగన్ తానే ఒంటిచేత్తో రాష్ట్రాన్ని నడిపించాలన్న బిల్డప్ ఇచ్చేశాడు. బటన్ నొక్కుతున్నాను కదా? ఈవీఎంలో కూడా ఫ్యాన్ పై నొక్కుతారని భ్రమించి అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్నారని ఇప్పుడువైసీపీ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. కేవలం వారు మనసులో దాచుకోవడం లేదు. వచ్చే ఎన్నికల తర్వాత జగన్ తన తీరును మార్చుకోవాలని కూడా నేతలు సూచిస్తున్నారంటే నేతలు ఏ మాత్రం హర్ట్ అయ్యారో వేరే చెప్పాల్సిన పనిలేదు. తాజాగా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి. జగన్ వాలంటీర్ల వ్యవస్థను దూరం పెట్టాలని గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యానించారు. తాను కూడా ఈ విషయాన్ని జగన్ కు ఎప్పుడో చెప్పానంటూ ఆయన అన్నారు. అంటే వాలంటీర్ల వ్యవస్థ పార్టీని ఎంత డ్యామేజీ చేసిందో జగన్ కు ఈ పాటికి అర్థమయి ఉండాలి. కార్యకర్తలకు పనులు అప్పజెప్పాల్సిన జగన్ వాలంటీర్లను తీసుకుని వారి నెత్తిపై పెట్టడంతో ఇటు కార్యకర్తలు, అటు ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ పెరిగిపోయింది. ప్రజలకు కూడా అసలు వైసీపీ నేతలను సంప్రదించాల్సిన అవసరం లేకుండా పోయింది. దీంతో స్థానిక నాయకత్వానికి, ప్రజలకు మధ్య కనెక్షన్ కట్ అయింది. ఈ కారణంగానే గత ఎన్నికల్లో ప్రజల వద్దకు వాలంటీర్లు వెళ్లలేదు. కార్యకర్తలు వెళ్లలేదు.

# విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

సోమవారం 14 జూలై 2025


www.viswamvoice.com

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో ఆదిత్య స్వచ్ఛభారత్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రి ఆదిత్య డిగ్రీ కళాశాల మరియు మహిళా డిగ్రీ కళాశాల లకు చెందిన ఎన్.ఎస్.ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు ఆదివారం ఉదయం స్థానిక కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ఎమ్మార్వో కార్యాలయం ప్రక్కన ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో వ్యర్థపదార్థాలను తొలగించి,ప్లాస్టిక్ ను ఏరి వేసి పరిశుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎఫ్. ఎస్.ఎస్. సభ్యులు కె. సుధాకర్ పట్నాయక్,ఆజాద్ రాజు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎం.సి.మెంబర్ డాక్టర్ జి. ఎన్.వి. ఎ. బి.ఎస్. మహాలక్ష్మి,జిల్లా కోఆర్డినేటర్ పి. రాంబాబు, సిబ్బంది పి. పద్మ ఫార్మర్,ఎన్.ఎస్.ఎస్. సీనియర్ నాయకులు, సుమ, మౌనిష్ మరియు అభిషేక్, ప్రస్తుత ఎన్.ఎస్.ఎస్.నాయకులు వినయ్,సూర్య, శ్రావణి, యశస్విని, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాజమండ్రి ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి రూపకల్పన చేయగా, ఆదిత్య ఎన్.ఎస్.ఎస్.కోఆర్డినేటర్ డా. జి. వి.ఎస్.నాగేశ్వరరావు సారధ్యంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ పోలు కొండ సాయి,శిరీష, కె.మహేశ్వరి పాల్గొన్నారు. మరో ఎన్. ఎస్. ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి హెచ్. వి. రమాదేవి తమ సహకారం అందజేశారు. ఒక వారంలో ఎన్నో కార్యక్రమాలు చేయుచున్న డాక్టర్ జి.వి.ఎస్.నాగేశ్వరరావు తదితర బృందాన్ని, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్ ను ప్రిన్సిపాల్ సిహెచ్ ఫణి కుమార్,ఎస్.కె. ఎన్.రెహమాన్,చంద్రశేఖర్, రామకృష్ణలు అభినందనలు తెలియజేశారు.

## నగర దేవాంగ సంక్షేమ సంఘ సమావేశం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రి జాంపేట శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి కళ్యాణమండపంలో రాజమండ్రి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగర అధ్యక్షులు రొబ్బి విజయ్ శేఖర్ అధ్యక్షతన సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సంఘ నగర ప్రధాన కార్యదర్శి కాలెపు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ దేవాంగ కుల దేవత శ్రీ శ్రీ శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జయంతోత్సవం పురస్కరించుకుని ఈ నెల 24వ తేదీ గురువారం ఆషాడ అమావాస్య రోజున జాంపేట శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి కళ్యాణమండపం నందు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని,ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు,సాయంత్రం అమ్మవారికి మహిళామణులచే సారే,భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నామని,ఈ కార్యక్రమంలో రాజమండ్రి లోని దేవాంగ సంఘీయులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ అధికార ప్రతినిధి కేకే సంజీవరావు, బీరా శ్యామలరావు, చింతా వెంకట చలపతి,బళ్ళా శ్రీనివాసరావు, పూర్ణిమ ప్రసాద్,బీరా పద్మనాభ రావు,మావూరి బాబూరావు,పిచ్చిక అనిల్ కుమార్,పింజర్ల భాస్కరరావు,చప్పటి సత్యనారాయణ, జిలగం గవర్రాజు,కేవీ మల్లిఖార్జున రావు,యు సోమ శేఖర్,ఏ సాంబ,ఆకాశపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురం ఆర్టీసీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కండక్టర్ దినోత్సవం



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-** రామచంద్రపురంఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో అంతర్జాతీయ కండక్టర్ దినోత్సవం ఘనంగా జరిగింది. అయితే ఈ కార్యక్రమాన్ని ఉదేశించి అసోసియేషన్ యొక్క విధివిధానాలను పి.సత్తిబాబు తెలియజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పి భాస్కర్ రావు మాట్లాడుతూ సంస్థలో వస్తున్న టెక్నాలజీని ఆహ్వానించాలని దానికి అనుగుణంగా మనం సిద్ధం కావాలని తెలిపారు. ఎస్వి రమణ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా లేని ఒక మంచి సంప్రదాయాన్ని కట్టుబాటుని కలిసికట్టుగా ఒక్క తాటిపై కి తీసుకొచ్చి కండక్టర్ అసోసియేషన్ ఏర్పాటుకు సహకరించిన సీనియర్ కండక్టర్స్ అందరికీ మరొక్కసారి శుభాభినందనలు తెలిపారు.సంస్థలో ఏ ఒక్కరికి ఆర్థిక ఇబ్బంది వచ్చిన అనారోగ్య పరిస్థితులు ఉన్న స్పందించి ప్రతి ఒక్కరూ సేవా భావంగా చేయి చేయి కలిపి ఆర్థికంగా ఆదుకుంటున్నారు. అసోసియేషన్ నిర్వాహకులు పి గంగాధరరావు,ఆనంద్ కుమార్, జి అన్నారు.సీనియర్ నాయకులు గెడ్డం శ్రీను,ఎం వి ఎస్ మూర్తి,జి డి పి కుమార్,మండపేట మాస్టర్ డి శ్రీనివాసరావు,ఎం వీరబాబు అసోసియేషన్ కి వెన్నుదన్నుగా ఉన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు కలిసుందాం కలిసి పోరాడుదాం అని, ఆర్టీసీ ని బలోపేతం చేద్దాం అన్నారు.

# జనసేన పార్టీ గెలుపు కోసం బిడ్డల ఆస్తులైన అమ్ముతా








బత్తుల. వెంకటలక్ష్మి లక్ష్యం నెరవేరింది.

స్థానికసంస్థల ఎన్నికలలో పార్టీ గెలుపే ధ్యేయం.

**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి బడుగు బలహీన వర్గాల ఆర్థిక బలోపేతానికి స్థాపించిన జనసేన పార్టీ గెలుపు కోసం బిడ్డల ఆస్తులైన అమ్మడానికి సిద్ధంగా ఉన్నానని రాజానగరం శాసనసభ్యులు జనసేన పార్టీ నాసేన కోసం నా వంతు కోఆర్డినేటర్ బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులు అన్నారు. ఆదివారం రాజానగరం రాయల్ కన్వెన్షన్ హాల్ లో జన సైనికులు వీర మహిళల ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ పరిపాలన దక్షత కలిగిన చంద్రబాబు, నీతి నిబద్ధత కలిగిన విశ్వగురువు మోడీ, వీరిద్దరి సఖ్యతతో త్రిశూలంగా మారిన మన అధినేత పవన్ కళ్యాణ్ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆరో పదిహేనేళ్లపాటు రాష్ట్రంలో ఎన్డీఏ అధికారంలో ఉంటుందని రాజానగరం నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే బత్తుల కుటుంబం ముఖ్య ఉద్దేశం అన్నారు. వైసిపి ప్రభుత్వం మన రాజధాని అమరావతి, ఆంధ్రుల చిరకాల స్వప్నం పోలవరాన్ని పూర్తిగా విస్మరించిందని, ఎన్డీఏ ప్రభుత్వం అమరావతి,పోలవరానికి పెద్దపీట వేసి యువత భవిష్యత్తుకు, వ్యవసాయరంగ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ ఉన్నంతవరకు ఎక్కడ జగన్మోహన్ రెడ్డి ఆటలు సాగనివ్వడని, రాజానగరం నియోజకవర్గంలో బత్తుల ఉన్నంతవరకు జక్కంపూడికి స్థానం ఉండదన్నారు. జక్కంపూడి రాజాను ఓడించడమే లక్ష్యంగా తన సతీమణి వెంకటలక్ష్మి కంకణ కట్టుకొని, మీ అందరి సహకారంతో చేసి చూపించారన్నారు. జన సైనికులకు, వీర మహిళలకు తన మనసులో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని, వైసిపి కుతంత్రాలకు తగిన బుద్ధి చెప్పి, ఏకదటిగా పార్టీని ముందుకు తీసుకువెళ్దామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ దందాలు, భూ కబ్జాలు, రౌడీయిజం, గంజాయి, బ్లేడ్ బ్యాచిలను ఆణిచివేసి, ప్రశాంత నియోజకవర్గ చేశామన్నారు. శ్రావణమాసంలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీలను వేసి పార్టీ బలోపేతంతో పాటు ఏ స్థాయిలో సమస్యలను అక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు అన్ని స్థానాల్లో గెలవాలని, జనసైనికులు వీర మహిళలు అకుంఠిత దీక్షతో పార్టీకే పని చేయాలన్నారు. పవన్ ఆశయాలు నెరవేర్చడానికి, పార్టీ గెలుపుకు అవసరమైతే పిల్లల ఆస్తులు అమ్మడానికైనా తాము సిద్ధమే అన్నారు. వెంకటలక్ష్మి మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గం అంతా తనకు పుట్టినిల్లని, ఎవరికి ఏ కష్టం వచ్చినా బత్తుల కుటుంబం అండగా నిలుస్తుందన్నారు. పార్టీ శ్రేణులు ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని, పార్టీ గెలుపుకు అందరం అంకితభావంతో పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల నాయకులు, జన సైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అల్లు రాజేశ్వరి చేసిన సేవలు చిరస్మరణీయం

– సంతాప సభలో జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**మాజీ కౌన్సిలర్ దివంగత అల్లు రాజేశ్వరి అందించిన సేవలు నిరుపమానమని తూర్పుగోదావరి జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నివాళులర్పించింది. జె ఎన్ రోడ్డులోని ఐశ్వర్య అపార్ట్మెంట్స్ లోని అల్లు బాబీ స్వగృహంలో ఆదివారం తూర్పుగోదావరి జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వరంలో సంతాప సభ నిర్వహించారు. కోనే శ్రీను అధ్యక్షతన ఏర్పాటైన ఈ సభలో అల్లు రాజేశ్వరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.రావు అండ్ రావు స్టూడియో అధినేత ఎపి నారాయణరావు మాట్లాడుతూ 1987 లో కౌన్సిలర్ గా ఎన్నికైన అల్లు రాజేశ్వరి అందరితో సఖ్యతగా మెలుగుతూ ఎన్నో సమస్యలు పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారని, ఆమె బాటలో కుమారుడు అల్లు బాబీ ప్రయాణిస్తూ 2003లో కార్పొరేటర్ గా సేవలు అందించారని గుర్తుచేసారు. తమ అసోసియేషన్ కి గౌరవ అధ్యక్షులుగా బాబీ వ్యవహరిస్తూ మంచి సలహాలు సూచనలతో నడిపిసితున్నారని అన్నారు. సభ్యులు మాట్లాడుతూ అల్లు రాజేశ్వరి చేసిన సేవలు బాబీకి, ఇతర కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.కోనే శ్రీను, కేత శ్రీను, సిరి శ్రీను, ప్రభాకర్ , కడియం మండలం గౌరవ అధ్యక్షులు లక్ష్మీనారాయణ చౌదరి, ప్రభాకర్, గోకవరం అధ్యక్షులు సన్నపు శాంతిబాబు, గోకవరం బాలు, బుడ్డిగా రాధా ( నగర తెలుగుదేశ ప్రధాన కార్యదర్శి), కొవ్వూరు ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గల్లా రాజు ,ఆషా రాంబాబు, నరేంద్ర, రాజానగరం లాజర్, కోరుకొండ మాజీ సెక్రెటరీ మధురమ రమేష్, గాయత్రి సతీష్, బిఎంపిఎస్ శ్రీను, విజేతమూర్తి, విజేత సతీష్, విజేత రమేష్, జాఫర్, ఉభయగోదావరి జిల్లాల నుండి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు, ఫోటోగ్రాఫర్లు ఈ సభలో పాల్గొన్నారు.

# కోయ భాషను 8వ,షెడ్యూల్ లో చేర్చాలి.





కోయ భాష పండిట్లను నియమించాలి.

ఆదివాసీ జేఏసీ డిమాండ్.

దేవీ పట్నం,విశ్వం వాయిస్ న్యూస్బీ

కోయ భాషను 8వ,షెడ్యూల్ లో చేర్చాలి.మరియు కోయ భాష పండిట్లను నియమించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు.అల్లూరి సీతారామరాజు జిల్లా,రంపచోడవరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోయ భాష పరిరక్షణ కమిటీ జాతీయ సమన్వయ కర్త మడివి నెహ్రూ మాట్లాడుతూ ఆనాడు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు చేసే సమయంలో భారత దేశంలో 14 రాష్ట్రాలలో ఉన్న ఆదివాసీలకు ప్రత్యేక ఆదివాసీ స్వయం పాలన రాష్ట్రం ఏర్పాటు చేయకుండా అప్పటి నుండి రాష్ట్రాల విభజన లోనూ,జిల్లాల పునర్విభజనలోనూ ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో ఆదివాసీలను చిన్నాభిన్నం చేస్తున్నారే తప్ప ఆదివాసీల హక్కులు,చట్టాలు పరిరక్షణ కోసం,అభివృద్ధి,సంక్షేమం కోసం, మాతృ భాష పరిరక్షణ కోసం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 242 ప్రకారం 8వ, షెడ్యూల్ లో చేర్చి ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసి,కోయ భాష పండిట్లను నియమించి కోయ భాషను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు.అలాగే అల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కంగాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన దినోత్సవం సందర్భంగా గ్రామ గ్రామాన కోయ భాష దినోత్సవ వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.అలాగే ఏపీ ఆదివాసీ జేఏసీ జిల్లా అధ్యక్షులు రామారావు దొర మాట్లాడుతూ ఆదివాసీ స్వయం పాలన రాష్ట్రం సాధన ద్వారానే ఆదివాసీ హక్కులు,చట్టాలు,సంక్షేమం,అభ్రిద్ధి సాధ్యమౌతాయన్నారు. ఆదిశగా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,సయుక్త కార్యదర్శి మడకం వరప్రసాద్ దొర,కోర్ కమిటీ సభ్యులు మట్ల కృష్ణా రెడ్డి,జాతీయ సలహాదారులు పొడియం పండు దొర,తుష్టి జోగా రావు,చిచ్చుడి శ్యామల రావు,శ్రీనివాస్ పడాల్,సురేష్, ఈక వెంకన్న దొర,కారం రంగారావు దొర,డి.దుర్గ భవాని, పల్లాల రాజ్ కుమార్ రెడ్డి మొదలైన వారు పాల్గొన్నారు.

## వేగులమ్మ అమ్మవారిని దర్శించిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామంలో కొలువైయున్న శ్రీ శ్రీశ్రీ వేగులమ్మ అమ్మవారి సారె కార్యక్రమంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని అమ్మవారిని దర్శించారు. ఈ సందర్భంగా ఆలయం కమిటీ వారు బత్తుల వెంకటలక్ష్మిని సత్కరించి అమ్మవారి సారె అందజేశారు .ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం ,బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు..

## దోసపల్లి వారి రజస్వల వేడుకలో పాల్గొన్న బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ములకల్లంక గ్రామం ప్రభాకర్ కాలనీలో ఘనంగా జరిగిన దోసపల్లి వారి రజస్వల వేడుకకు దోసపల్లి వీర వెంకట సత్యనారాయణ ఆహ్వానం మేరకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని చిరంజీవి వినీలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు..

## మిస్సింగ్ మహిళను ట్రేస్ చేసిన గండేపల్లి పోలీసులు



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపీఎస్ మిస్సింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటువంటి ఘటనలపై అన్ని కోణాల్లో విచారణ చేసి బాధితులను సురక్షితంగా గుర్తించి, బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించాల్సిందిగా సంబంధిత పోలీసు అధికారులకు నిర్దేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన 23 ఏళ్ల వివాహిత భర్త వద్దకు వెళ్లడానికి నిరాకరించి, కుటుంబ సభ్యులకు తెలియకుండా మిస్సింగ్ అయిన ఘటనపై గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో సి అర్ నెంబర్ 114/2025 యూ /స్ ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు అయింది. ఈ కేసును అధిక ప్రాధాన్యతతో తీసుకున్న గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు మరియు ఆయన పోలీసు బృందం వివిధ టీమ్ లు గా విడిపోయి గాలింపు చర్యలు చేపట్టి, తగిన ఆధారాలను సేకరించారు. చివరకు పక్కా సమాచారం ఆధారంగా ఆమెను నెల్లూరు పట్టణంలో గుర్తించి, అక్కడికి వెళ్లి సురక్షితంగా పోలీసులు ఆమెను పట్టుకుని గండేపల్లికి తీసుకువచ్చారు. అనంతరం ఆమె తల్లికి అధికారికంగా అప్పగింపు చేశారు. ఈ విజయవంతమైన చర్యకు గాను జగ్గంపేట సి ఐ వై ఆర్ కె శ్రీనివాస్ మరియు గండేపల్లి పోలీస్ బృందానికి ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎస్ పి మార్గదర్శకంలో మిస్సింగ్ కేసుల పరిష్కారానికి పోలీసులు నిబద్ధతతో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

## బొబ్బిల్లంకలో కాకుల విష్ణు కుటుంబాన్నిపరామర్శించిన బత్తుల వెంకటలక్ష్మి




సీతానగరంవిశ్వం వాయిస్ న్యూస్:రాజానగరం నియోజకవర్గం, సీతానగరం మండలం, బొబ్బిల్లంక గ్రామం లో కాకుల విష్ణు భార్య నాగలక్ష్మి ఇటీవల స్వర్గస్థులయ్యారు. వారి పెద్దకార్యనికి జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు స్టేట్ కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకట లక్ష్మి హాజరయ్యారు. నాగలక్ష్మి గారి ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సబ్యులకు మనోధైర్యం ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు

# ఎడిటర్ వాయిస్

## ప్రైవేట్ సంస్థలకే నిర్మాణ బాధ్యతలు

భారత్–ఇంగ్లాండ్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు ఆసక్తితో చూస్తుండగా ప్రముఖ సిమెంట్ కంపెనీ వాణిజ్య ప్రకటన ట్యాగ్‌లైన్ ఒకటి నన్ను విశేషంగా ఆకర్షించింది. అదిలా ఉంది: '. ఇది నూటికి నూరుపాళ్ల సత్యం. అవును, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ విస్తరణ మధ్య బలమైన సానుకూల సంబంధముంటుంది. రోడ్లు, వంతెనలు, రైల్వేలు, విమానాశ్రయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు మొదలైన వాటికి భవనాలు నిర్మించాలి. ఈ సామాజిక, సామూహిక సదుపాయాలను సమృద్ధిగా నిర్మించుకున్నప్పుడే ఆర్థిక వ్యవస్థ విస్తరణ సాధ్యమవుతుంది. ఈ మౌలిక సదుపాయాలను మనం సత్వరమే అభివృద్ధిపరచుకోవాలి. అయితే వాటిని ఎలా నిర్మించుకోవాలో మనం తెలుసుకుని తీరాలి. జవహర్‌లాల్ నెహ్రూ ఒక గొప్ప నిర్మాత. ఆయనను ద్వేషించేవారు చేస్తున్న విమర్శలు నయా పైసా విలువలేనివి. 1947లో మన దేశ జనాభా 34 కోట్లు. అక్షరాస్యత రేటు కేవలం 12 శాతం. తన 17 ఏళ్ల ప్రధానమంత్రిత్వ కాలంలో నెహ్రూ ఎన్నో పాఠశాలలు, కళాశాలలు నిర్మించారు. ఐఐటీలు, ఐఐఎమ్‌లు, ఉక్కు కర్మాగారాలు, ఐఓసీ, ఓఎన్‌జీసీ, ఎన్ఎల్‌సీ, హెచ్ఏఎల్, బీహెచ్ఈఎల్, ఇస్రో, భాక్రానంగల్, హీరాకుడ్, దామోదర్ వ్యాలీ, ఇంకా ఎన్నో సమున్నత సంస్థలు, బహుళార్థ సాధక ప్రాజెక్టులు, పారిశ్రామిక సంస్థలకు ఆయనే అంకురార్పణ చేశారు, నిర్మించి అభివృద్ధిపరిచారు. ఇదంతా జరిగింది స్వాతంత్ర్య తొలి సంవత్సరాలలోను, అదీనూ విద్యా వ్యాప్తి చాలా తక్కువగా ఉన్న, సాంకేతికతలు అందుబాటులో లేని, మానవ వనరులకు నైపుణ్యాలు కొరవడిన కాలంలో అన్న వాస్తవాన్ని విస్మరించకపోతే నెహ్రూ నిర్మాణ సామర్థ్యం ఎంత మహోన్నతమైనదో అర్థమవుతుంది. నెహ్రూ నిర్మించినవి ఈ నాటికీ ఉన్నాయి, జాతి పురోగతికి అద్వితీయంగా దోహదం చేస్తున్నాయి. నెహ్రూ భారత్‌కు ఆర్థిక వనరులు తక్కువగా ఉండవచ్చునేమో కానీ, చిత్తశుద్ధి, అంకిత స్వభావం, ప్రతిభాపాటవాలు ఉన్న మానవవనరులు సమృద్ధిగా ఉన్నాయి. క్రీస్తుశకం రెండవ శతాబ్దిలో చోళ చక్రవర్తి కావేరీ నదిపై గొప్ప ఆనకట్ట నిర్మించాడు. ప్రపంచంలో అత్యంత పురాతన ఆనకట్టలలో అదొకటి. నేటికీ ఉపయోగంలో ఉన్నది. వేలాది ఎకరాలకు సాగునీటి సదుపాయాన్ని కల్పిస్తున్నది. అంతకంటే ముఖ్యంగా వరదల నియంత్రణకు ఇతోధికంగా తోడ్పడుతోంది. భారత్ నేటికీ ప్రతి రోజూ ఈ మహా నిర్మాణ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉన్నది. అయితే ప్రైవేట్ రంగంలో నిర్మాణాల, ప్రభుత్వ రంగంలో నిర్మాణాల నాణ్యత, మన్నిక మధ్య ఎంత వ్యత్యాసమున్నదో ప్రతి పౌరుడికీ బాగా తెలుసు. ఈ రెండు విధాల నిర్మాణ కార్యకలాపాలలోనూ కాంట్రాక్టర్లు పాల్గొంటున్నారు. అయితే వారు ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు వేర్వేరుగా ఉంటున్నాయి. నిర్మాణ ప్రక్రియలూ భిన్నమైనవి. ప్రజల ధనంతో ప్రభుత్వ రంగంలో జరుగుతున్న నిర్మాణ కార్యకలాపాల తీరుతెన్నులను పరిశీలిద్దాం. ప్రైవేట్ నిర్మాణ కార్యకలాపాల నాణ్యత ఎంపిక చేసుకున్న ఆర్కిటెక్ట్, నియమించుకున్న కాంట్రాక్టర్, నిధుల లభ్యతపై ఆధారపడి భిన్నంగా ఉంటుంది. ప్రభుత్వ నిర్మాణ కార్యకలాపాలు, మరీ ముఖ్యంగా జాతీయ ప్రాధాన్యమున్న ప్రాజెక్టులకు భూమి, నిధుల పరంగా అవరోధాలు ఉండవు. అయితే మనం చూస్తున్నదేమిటి? హైవేలు, కొత్త రోడ్లు నిర్మాణమయి అవగానే కుంగిపోతున్నాయి. మురుగునీటిని తీసుకువెళ్లే కాలవలు లేదా గొట్టాలు పగిలిపోయి రోడ్లపై మురుగునీరు వెల్లువెత్తుతోంది. దేశ రాజధానిలోని అశోకా రోడ్డులో గత 18 నెలల్లో మురుగునీటి గొట్టాలు పగిలిపోవడం, రోడ్డు కుంగిపోవడం మూడుసార్లు సంభవించింది. రోడ్లు గుంతలమయమైపోతున్నాయి. ఆ బాటల్లో ప్రయాణిస్తున్న వాహనాలు ఆ గుంతల్లో పడిపోతున్నాయి. గ్వాలియర్‌లో రూ. 18 కోట్ల వ్యయంతో నిర్మాణమైన ఒక రోడ్డు 15 రోజులలోనే కుంగిపోయింది. గుజరాత్‌లోని మోర్బిలో మరమ్మతు నిర్వహించి వాహనాల రాకపోకలకు పునఃప్రారంభించిన ఒక వంతెన నాలుగు రోజులలోనే కూలిపోవడంతో 141 మంది మరణించారు. సరైన అర్హతలులేని కంపెనీకి ఆ వంతెన మరమ్మతు, పునరుద్ధరణ పనులను అప్పగించినట్టు విచారణలో వెల్లడయింది. సదరు కాంట్రాక్టర్ నాసిరకం సామగ్రిని ఉపయోగించడం వల్లే వంతెన కూలిపోవడం జరిగింది. బిహార్‌లో వంతెనలు నిర్మాణంలో ఉన్నప్పుడో లేదా నిర్మాణమైన వెంటనే కూలిపోతేనో ఆశ్చర్యపోయేవాళ్లు ఎవరూ ఉండరు సుమా! ఒక వంతెన అయితే నిర్మాణంలో ఉండగానే మూడుసార్లు కూలిపోయింది! ఎంత సమయం, మరెంత ధనం వృథా! ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. మొట్టమొదటి కారణం జవాబుదారీతనం పూర్తిగా లోపించడమే. ఒక వినాశనకర ప్రాజెక్టుకు పలువురు అధికారులు బాధ్యులయితే అంతిమంగా ఆ నష్టానికి ఏ ఒక్కరూ జవాబుదారీ కాదు అన్న రీతిలో పరిస్థితులు ఉన్నాయి. ఈ కారణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతారహితంగా వ్యవహరించడం సాధారణమైపోయింది. రాజకీయ అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? అపరిమిత ఆర్థిక లబ్ధిని సమకూర్చే మంత్రిత్వశాఖల విషయమై మంత్రుల మధ్య తీవ్ర పోటీ ఉంటోంది. చాలా రాష్ట్రాలలో 'రేట్ కార్డ్' ఉన్నది. ప్రాజెక్టులను అధ్వానంగా అమలుపరచడంలో కొన్ని విభాగాలు/ఏజెన్సీలు అప్రతిష్ఠను మూటకట్టుకుంటున్నాయి. ఈ విషయంలో పీడబ్ల్యూడీలు అగ్రగామిగా ఉన్నాయి. తక్కువ వ్యయ గృహ నిర్మాణాలు చేసే (ఇవి నిజానికి కాంక్రీట్ మురికివాడలు) డీడీఏ మొదలైన వాటి తీరుతెన్నులు కూడా ప్రశస్తంగా ఉండడం లేదు. హైవేస్, రైల్వేస్ పని తీరుకూడా ఇదే రీతిలో అధ్వానంగా ఉంటోంది.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# హిందీతో ఒరిగిందేంటి?

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి భాషా తేనెతుట్టెను తట్టిలేపింది. బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర సర్కార్లను ముందుపెట్టి హిందీని బలవంతంగా రుద్దాలని చూసిన మోదీ సర్కారుకు భంగపాటు ఎదురైంది. 'నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020' ముసుగులో ప్రాథమిక విద్యలోనూ థర్డ్ లాంగ్వేజ్‌గా హిందీని తప్పనిసరిగా చేద్దామని చూసిన మహారాష్ట్ర బీజేపీ ప్రభుత్వంపై ఆ రాష్ట్రంలో నిరసనలు వ్యక్తమవుతుండటమే అందుకు నిదర్శనం. ఈ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఫడణవీస్ సర్కారు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. అయితే, 'ఆప్షనల్' పేరిట, అధ్యయన కమిటీ రూపేణా దొడ్డిదారిన హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నాలు కొనసాగుతుండటంతో మహారాష్ట్రలో భాషా వివాదం ఇంకా రగులుతూనే ఉన్నది. హిందీ భాషను బలవంతంగా రుద్దడంపై ఇప్పటికే పలు రాష్ట్రాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. మోదీ సర్కారు తీసుకొచ్చిన త్రీ లాంగ్వేజ్ పాలసీని తమిళనాడు సహా దేశంలోని అనేక రాష్ట్రాలు మొదటినుంచీ వ్యతిరేకిస్తున్నాయి. బలవంతంగా హిందీని రుద్దే ప్రయత్నంగా ఈ నిర్ణయాన్ని అన్ని వర్గాలు అభివర్ణిస్తున్నాయి. ఈ వివాదం ఇప్పుడు మహారాష్ట్రలో అగ్గిరాజేసింది. స్టేట్ బోర్డు ఆధ్వర్యంలో నడిచే మరాఠా, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ప్రాథమిక విద్యలోనూ (గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5) హిందీని థర్డ్ లాంగ్వేజ్‌గా తప్పనిసరి చేస్తూ ఏప్రిల్ 16న మహారాష్ట్ర సర్కారు ఉత్తర్వులు జారీచేయడంతో మహారాష్ట్రలో భాషా కుంపటి రాజుకుంది. మరాఠా, ఇంగ్లీష్ మీడియం మినహా ఇతర మీడియం పాఠశాలల్లో ప్రాథమిక విద్యలో ఇప్పటికే థర్డ్ లాంగ్వేజ్ విధానం అమల్లో ఉండగా.. మరాఠా, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో మాత్రం గ్రేడ్–5 నుంచి మాత్రమే థర్డ్ లాంగ్వేజ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. కనీస అధ్యయనం లేకుండా, చర్చలు చేయకుండా చిన్నారులపై హిందీని రుద్దడంపై ఆ రాష్ట్ర మేధావులు, భాషావేత్తలు, విద్యావేత్తలు, సాహితీవేత్తలు, ప్రాంతీయ భాషాభివృద్ధి సంస్థలు, రాజకీయ పార్టీల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ప్రాథమిక విద్యలో థర్డ్ లాంగ్వేజ్‌ను అమలు చేయడం, పైగా హిందీని రుద్దాలని చూడటాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది సాంస్కృతికంగా మరాఠా భాషను దెబ్బకొట్టడమేనని వారు మండిపడుతున్నారు. ఆరెస్సెస్ విధానం 'హిందీ, హిందూ, హిందుస్థాన్'లో భాగంగా మహారాష్ట్ర సర్కారు హిందీని తమ నెత్తిన రుద్దుతున్నదని పలువురు విమర్శించారు. చివరికి ప్రభుత్వం నియమించిన భాషా సలహా కమిటీ సైతం ఈ నిర్ణయాన్ని తప్పుబట్టింది. ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ నేపథ్యంలో హిందీ తప్పనిసరి కాదని మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే ప్రకటించాల్సి వచ్చింది. అయితే, హిందీని జనరల్ థర్డ్




లాంగ్వేజ్‌గా పేర్కొంటూ జూన్ 17న మహారాష్ట్ర సర్కారు మరో ఉత్తర్వు జారీచేసింది. దేశంలోని ఏదైనా భాషను థర్డ్ లాంగ్వేజ్‌గా ఎంచుకోవచ్చని కానీ, కనీసం 20 మంది విద్యార్థుల నుంచి ఆ మేరకు డిమాండ్ రావాలని ఆ ఉత్తర్వులో పేర్కొనడంపై మహారాష్ట్రలో మరోసారి దుమారం చెలరేగింది. హిందీ వివాదం మహారాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులను తీసుకొచ్చింది. మరాఠాల ఆత్మగౌరవమే తమ పార్టీ సిద్ధాంతమని చెప్పుకొనే మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన ఈ విషయంపై తీవ్రంగా స్పందించింది. 'మనం హిందువులం, హిందీలం కాదు' అని ఆ పార్టీ అధ్యక్షుడు రాజ్ ఠాక్రే ఘాటుగా స్పందించారు. ఈ వివాదం ఠాక్రే సోదరుల కలయికకు మార్గం సుగమం చేసింది. రెండు దశాబ్దాల రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి రాజ్ ఠాక్రే, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఒకే వేదికను పంచుకున్నారు. 'హిందీ మాట్లాడే రాష్ట్రాలన్నీ మహారాష్ట్ర కంటే చాలా వెనుకబడి ఉన్నాయి. ఆ రాష్ట్రాల ప్రజలు హిందీ మాట్లాడని రాష్ట్రాలకు వలసపోతున్నారు. హిందీ వల్ల వారికేమైనా ఒరిగిందా? మరి మేం ఎందుకు హిందీ నేర్చుకోవాలి?' అని రాజ్ ఠాక్రే బీజేపీ పాలకులను ప్రశ్నించారు. 'ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్‌లో థర్డ్ లాంగ్వేజ్‌గా ఏ భాష ఉంది' అని ఉద్ధవ్ ఠాక్రే నిలదీశారు. మరోవైపు మహాయుతి కూటమిలోనూ 'హిందీ' రగడ మొదలైంది. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కూడా సొంత ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు. గ్రేడ్–4 వరకు హిందీని అమలు చేయకూడదని ఆయన చెప్పడంతో ఫడణవీస్ సర్కారు కంగుతిన్నది. ఈ నేపథ్యంలో సవరించిన ఉత్తర్వులను కూడా వెనక్కి తీసుకుంటున్నట్టు ఫడణవీస్ ప్రకటించారు. త్రీ లాంగ్వేజ్ పాలసీపై అధ్యయనం చేసేందుకు ఆర్థికవేత్త నాగేంద్ర జాదవ్ నేతృత్వంలో ఓ కమిటీని నియమించగా, దానిపైనా విమర్శలు వెల్లువెత్తాయి. మొత్తానికి ఈ కమిటీతోపాటు త్రీ లాంగ్వేజ్ పాలసీని రద్దు చేయాలని మహారాష్ట్రలో డిమాండ్లు ఊపందుకున్నాయి. ఇంగ్లీష్ మాట్లాడేవారు సిగ్గుపడాల్సిన రోజు వస్తుందని ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే, భాషా వైవిధ్యమనేది భారత బలం. ఇలాంటి వివాదాలు రాజకీయ లబ్ధి కోసం పాలకులు తెరపైకి తీసుకొచ్చేవేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రజా సమస్యలను, తమ వైఫల్యాలను పక్కదారిపట్టించేందుకు వారు చేసే కుతంత్రాలివి. ఈ వివాదాలు తాత్కాలికంగా రాజకీయ ప్రయోజనం చేకూర్చవచ్చేమో గానీ, శాశ్వతంగా మాత్రం కాదు. హిందీని బలవంతంగా రుద్దడం వల్ల దేశానికి, కొలువుల కోసం కండ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్న యువతకు ఒనగూడే ప్రయోజనం ఏమీ లేదు. వాస్తవానికి ఇంగ్లీష్ మాట్లాడేందుకు దేశ యువత ఏ మాత్రం సిగ్గుపడటం లేదు. కొలువులు తీసుకొచ్చే భాషగా ఇంగ్లీష్‌ను యువత చూస్తున్నది. యువత కొలువులను కోరుకుంటున్నారే తప్ప, సమస్యలు కప్పిపుచ్చే ఇలాంటి భాషా వివాదాలను కాదు.

# మన వీధికి వచ్చిన నాటకం

సాంస్కృతిక దార్శనికుడు బాదల్ సర్కార్. నాటకం అంటే పుక్కిటి పురాణం కాదనీ, జనజీవన ప్రతిబింబమని నమ్మిన బాదల్ సర్కార్ భారతీయ రంగస్థలాన్ని విప్లవీకరించారు. అభివ్యక్తికి ఒక మౌలిక లక్ష్యం నిర్దేశించారు. అసమానతల గోడల్ని కూల్చడం కోసమే కళ అంటూ నినదించారు. ఉన్నత వర్గాల వారికి మాత్రమే పరిమితమైన రంగస్థలానికి స్వేచ్ఛను ప్రసాదించి, ప్రజా రంగస్థలంగా మలిచారు. కల్పిత కథలు, నిజ జీవితంతో సంబంధం లేని పాత్రలను కాలదన్ని పీడిత ప్రజలకు అండనిచ్చే హృద్యమైన మానవతా మంద్ర స్వరంగా నాటకాన్ని బాదల్ మార్చివేశారు. నాటక ప్రయోక్తగా ఎన్నో భిన్నమైన ప్రయోగాలు చేశారు. సగటు మనిషి ప్రసక్తి లేని పౌరాణిక నాటకాన్ని, కులీన వర్గానికి మాత్రమే నవీన నాటకం రెంటినీ అధిగమించి మొట్టమొదటిసారిగా సగటు మనిషి కోసం 'మూడో రంగస్థలం' (థర్డ్ థియేటర్)ను సృష్టించారు. అందుకే ప్రపంచ రంగస్థలం ఆయన్ని 'ఫాదర్ ఆఫ్ థర్డ్ థియేటర్'గా గౌరవిస్తోంది. జూలై 15, 1925న కలకత్తాలో సుధీంద్ర సర్కార్‌గా పుట్టిన బాదల్ ఇంజనీరింగ్ చదివారు. ఇంగ్లాండ్, నైజీరియా మొదలైన దేశాలలో ఉద్యోగాలు చేశారు. యాభై వరకు నాటకాలు రచించిన బాదల్ సర్కార్ భారతదేశంలో పీడిత ప్రజల పక్షాన ప్రత్యామ్నాయ రంగస్థలాన్ని లోతుగా అధ్యయనం చేసిన మొదటి వ్యక్తి. సంప్రదాయక నాటక రంగాన్ని కాదని సమిష్టి కృషితోనే కళ సంపూర్ణ వికాసం పొందుతుందని ఆయన నిరూపించారు. అందుకే, నాటక ప్రదర్శనకి ఆయన సరికొత్త నిర్వచనం ఇచ్చారు. ప్రదర్శనశాలలకు పరిమితమైన నాటకాన్ని ఏకంగా నాలుగు వీధుల కూడలిలోకి తీసుకువచ్చి మొదటిసారిగా 'వీధి నాటకాన్ని' నిర్మించారు. భారతీయ రంగస్థల చరిత్రలో అదో అసాధారణ విప్లవం. నాటకం అంటే గంటలకొద్దీ సాగే కథనం కాదని, అది ఒక నిరంతర చైతన్య ప్రవాహమని బాదల్ చాటారు. వీధి నాటకాన్ని ప్రజా ఉద్యమంగా మలిచారు. ఆ ప్రక్రియలో నిత్య ప్రయోగశీలిగా నిలిచారు. ఈనాటికి కూడా స్ట్రీట్ ప్లే (వీధి నాటకం), అది ఏ ప్రాంతంలో, ఏ స్థాయిలో ప్రదర్శితమౌతున్నా దానికి ఆద్యుడు మాత్రం బాదల్ సర్కారే. బాదల్ సర్కార్ దృష్టిలో నాటకం అంటే జీవితాన్ని వినూత్నంగా దర్శింపజేసే విశిష్టమైన కళాత్మక సాధనం. అదేదో అలౌకికమైనది కాదు. సమాజంలో భాగం. జీవితానికి ప్రతిబింబం. సత్యాన్వేషణకి సోపానం. నాటక కళ నలుగుర్ని దగ్గరికి చేర్చాలి. వారి గుండె బరువు తీర్చాలి. అందుకే, అసలు వీధి నాటకం కళే కాదన్న వారికి దీటుగా జవాబిస్తూ, 'ప్రధాన స్రవంతి నాటకం ఆధిపత్య రూపమైతే, ప్రత్యామ్నాయ నాటకం మార్పుకు మాధ్యమం' అని బాదల్ నిరూపించారు. నక్సల్బరి ప్రభావితులయిన సగటు బెంగాల్ యువత సంక్లిష్ట మనస్తత్వాన్ని చిత్రించే అనేక విలువైన నాటక రచనలు బాదల్ చేశారు. 'అవర్ స్ట్రీట్ థియేటర్' (మన వీధి నాటకం) అన్న తన పుస్తకంలో పాలకుల నిర్బంధంలో వీధినాటకం, 'గెరిల్లా నాటకం'గా



రూపాంతరం చెందుతుందని బాదల్ అన్నారు. ప్రశ్నను సహించలేని పాలక వర్గాలు, ధిక్కారాన్ని ఓర్చుకోలేని ప్రభుత్వాలు కళలను కట్టడి చేయడానికి, అణచివేయడానికి ప్రయత్నించినప్పుడు ప్రజా నాటకం మరింత బలోపేతం కావాలని బాదల్ అన్నారు. నాటక కళా తాత్వికతను పునర్ నిర్వచించిన బాదల్, నాటకం అంటే కేవలం కల్పిత వినోద 'ప్రదర్శన' కాదని, అది వ్యవస్థలోని నిజాలను 'నిదర్శనం'గా చూపే శక్తిమంతమైన వాహకమని అన్నారు.

అందుకు అనుగుణంగానే చివరి వరకు ఆయన జీవితం సాగింది. దశాబ్దాల పాటు ప్రత్యామ్నాయ నాటక కళా ఉద్యమానికి నేతృత్వం వహించిన బాదల్ సర్కార్ ఎన్నడూ పాలకుల మెప్పు కోసం పాకులాడలేదు. మొదట్లో పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ పురస్కారాల్ని అంగీకరించినా తర్వాత కాలంలో చైతన్యం పెంపొంది ప్రభుత్వం ఇస్తానన్న పద్మభూషణ్ అవార్డును రెండుసార్లు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. 1967లో 'శతాబ్ది' అనే రంగస్థల సంస్థను స్థాపించిన బాదల్, ఈబాంగ్ ఇంద్రజిత్, బాసి ఖబర్, సారీ రాత్, పగల గోడా, స్పార్టకస్, బోమా వంటి అనేక వైవిధ్య నాటకాలు రచించారు. అతి తక్కువ ఖర్చుతో, తక్కువ మందితో ఎక్కడికక్కడ సొంతంగా ప్రదర్శించగలిగేది వీధి నాటకం. అందుకనే, పౌరసమాజంపై వెన్వెంటనే గాఢమైన ముద్రవేసే ఈ ప్రక్రియ త్వరలోనే ప్రజల్లోకి లోతుగా వెళ్ళిపోయింది. అనేక సాంస్కృతిక సంఘాలు వీధి నాటకాన్ని ఆయుధంగా ప్రయోగించడం పెరిగిపోయింది. 80వ దశకంలో కేరళలో ప్రారంభమై దేశ వ్యాప్తంగా కొనసాగిన వైజ్ఞానిక కళాజాతా మొదలుకుని జాతీయ స్థాయిలో జరిగిన మూఢనమ్మకాల వ్యతిరేక ఉద్యమం, తెలుగు రాష్ట్రాల్లో ఉవ్వెత్తున ఎగిసిన అక్షరాస్యత ఉద్యమం, మద్యపాన వ్యతిరేక ఉద్యమం తదితర ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న అసంఖ్యాక ప్రజలకు స్ఫూర్తి నింపిన వివిధ కళా రూపాలు, వీధి నాటకాలకు మూలం నాడు బాదల్ సర్కార్ రూపొందించిన రంగస్థల కార్యాచరణ ప్రభావితాలే. అదక్కడితో ఆగలేదు, అటు ఆదివాసి దళిత బహుజన సాంస్కృతిక సంస్థల నుండి, ఇటు ప్రగతిశీల మహిళా, గాంధేయవాద, సోషలిస్టు, వామపక్ష శక్తుల వరకు ప్రతి ప్రజాసంఘమూ వీధి నాటకాన్ని, భావజాల ప్రచార పనిముట్టుగా ఆశ్రయించాల్సి రావడం, బాదల్ సర్కార్ భావోద్యమాలలో సాధించిన అరుదైన విజయం. ప్రత్యామ్నాయ కళా రూపకంగా వీధి నాటకానికి మాత్రమే దక్కిన అపూర్వ గౌరవం. ప్రత్యామ్నాయ నాటకం ప్రజాచైతన్య పూరకం. మనిషి జీవితానికి సంబంధించిన ఉన్నత విలువలను ప్రమాణీకరించేది నాటకం. అది అనాదిగా అభివృద్ధి చెందుతున్న మానవాళి అభివ్యక్తికి ఆదర్శాత్మక చిహ్నం. కళాకారుడిగా, ప్రయోక్తగా, రచయితగా, సాంస్కృతిక కార్యకర్తగా, నిత్య చైతన్యశీలిగా బతికిన బాదల్ సర్కార్ 2011, మే 11న కేన్సర్‌తో చనిపోయారు. భారతీయ రంగస్థల చరిత్రలో మహత్తరమైన మార్పుకి సారథ్యం వహించిన ప్రజాపక్ష మేధావిగా బాదల్ సర్కార్ శాశ్వతంగా నిలిచిపోతారు. ఆయన దిశానిర్దేశం చేసిన ప్రత్యామ్నాయ రంగస్థలాన్నీ, అందులో ప్రధానమైన వీధి నాటకాన్ని మరింత బలోపేతం చేసుకుని సమసమాజ నిర్మాణం దిశగా సాగడమే బాదల్ సర్కార్ ఆశయ స్ఫూర్తికి మనం ఇవ్వాల్సిన బాధ్యతాయుతమైన నివాళి.

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుభాష్ ఎంపీ హరీష్

ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, నరసాపురం పరిశీలకు లు గుత్తుల సాయి



**ముమ్మిడివరం విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మరియు ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్,ముమ్మిడివరం ఎమ్మెల్యే ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తో కలిసి ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొన్నారు. 19 వ వార్డులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని అభివృద్ధిని వివరించారు. అలాగే కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చే సూచనలను,సలహాలను స్వీకరించడం జరిగింది. అలాగే రామచంద్రాపురం నియోజకవర్గం పామర్రు,యండగండి గ్రామాలలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొన్నారు.

## .నూతన సీసీ రోడ్లు ప్రారంభించిన ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు



**ముమ్మిడివరం విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి,ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం ప్రారంభించారు. నగర పంచాయతీ పరిధిలోని 25 లక్షల రూపాయల ఎంపీ లాడ్స్ నిధులతో రాజుపాలెం నుండి మట్టాడిపాలెంకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును అలాగే మరో 25 లక్షల రూపాయల ఎంపీ లాడ్స్ నిధులతో కాశీవారితూము నుండి చింతలమెరకకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును నిర్మించామన్నారు. అలాగే నియోజకవర్గంలో ఉన్న అన్ని రోడ్లను త్వరలోనే పూర్తి చేస్తామని ఎంపీ హరీష్ బాలయోగి, ఎమ్మెల్యే బుచ్చిబాబు లు తెలిపారు.

## బీచ్ పరిసర ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా పటిష్ట చర్యలు....

జిల్లా ఎస్పీ బిందు మాధవ్



**కాకినాడ రూరల్: విశ్వం వాయిస్ న్యూస్** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తీర ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా పటిష్ట చర్యలు తీసుకుంటున్న కాకినాడ జిల్లా పోలీసులుతెలియజేసారుకాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు, బీచ్ ప్రాంతాల్లో సందర్శకుల రద్దీ మరియు ప్రజల రక్షణ, భద్రతా అంశాలను దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిరోధించేందుకు కాకినాడ జిల్లా పరిధిలోని తీర ప్రాంతం పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. డ్రోన్ల ద్వారా అనుమానాస్పద, ప్రమాదకర చర్యలను ముందుగానే గుర్తించి, వెంటనే స్పందించగలిగే విధంగా ఏర్పాట్లు చేయబడ్డాయి. సందర్శకులు పోలీసుల సూచనలు, హెచ్చరికలను పాటించాలని తిమ్మాపురం సబ్ ఇన్స్పెక్టర్ గణేష్ ప్రజలకు సందర్శకులకు విజ్ఞప్తి చేశారు

## శానిటేషన్ లో నెంబర్ వన్..


మరి దోమల్లో??

మండపేట టౌన్...



**విశ్వం వాయిస్ న్యూస్...** ఇటీవలే ప్రకటించిన ఉత్తమ శానిటేషన్ మున్సిపాలిటీలో మండపేట మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఈ రికార్డు దక్కించుకోవడానికి మున్సిపల్ కమిషనర్, ఆర్ పి లు, శానిటేషన్ సెక్రటరీలు మరియు వర్కర్లు అందరూ కలిసి సమిష్టిగా కృషితో సాధించినప్పటికీ దోమల నిర్మూలన విషయంలో మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలే బాహాటంగా చర్చించుకుంటున్నారు. పుర విధుల్లో గల డ్రైనేజిలలో నీరు పారకుండా అడ్డంగా గుబురుగా మొలిచిన పిచ్చి మొక్కలే కాకుండా డ్రైనేజిలోంచి తీసిన చెత్తను తీసుకువెళ్లడంలోను అలసత్వం కనపడుతుందని అట్టహాసంగా చెప్పుకుంటున్నారు. ఒక పక్కన ఈ దోమల వల్ల విష జ్వరాలు, డెంగ్యూ విజృంభిస్తున్నాయి అయినా సరే నిమ్మకి నీరెత్తినట్టు మున్సిపల్ సిబ్బంది వైఖరి ర్యాంకుల కోసం కాకుండా ప్రజల ఆరోగ్యం కోసం పాటుపడాలని, డెంగ్యూ, వీష జ్వరాలపట్ల తీసుకోవలసిన తగు జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మారథం



**కొత్తపేట ఆత్రేయపురం జూలై 13. విశ్వం వాయిస్ న్యూస్.** ఏడాది పాలనలో ఎన్నో విజయాలు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. కూటమి ఏడాది పాలనలోనే ఇటు సంక్షేమం,అటు అభివృద్ధి అనే రెండు అంశాల్లో ఎన్నో విజయాలు సాధించామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నాడు. ఆత్రేయపురం మండలం ర్యాలిలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ విధ్వంసం, అరాచక పాలన వల్ల రాష్ట్రం అధోగతి పాలైందని, అయినా కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్ది ఏడాది పాలనలోనే పింఛన్ మొత్తాన్ని రూ. 4 వేలకు పెంపు, తల్లికి వందనం, దీపం, మెగా డీఎస్సీ వంటి హామీలు ప్రతిష్టాత్మకంగా అమలు చేసిందని తెలిపారు. 'అన్నదాత సుఖీభవ' పథకం అమలుకు కసరత్తు పూర్తయిందని, పీఎం కిసాన్ పథకం తో పాటు నగదు జమవుతుందని తెలిపారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు జరుగుతుందన్నారు. ఈ విధంగా ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు కూటమి ప్రభుత్వం శతధా కృషి చేస్తుందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సైతం పరుగులు పెట్టిస్తుందని తెలిపారు. పల్లెల్లో ఐదేళ్ల పాలనలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. అందుకే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారన్నారు.

# నేడు కలెక్టరేట్లో యధావిధిగా స్పందన అర్జీ పరిష్కార వేదిక

జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్



**అమలాపురం జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ జూలై 13** ఈనెల 14 వ తేదీ సోమ వారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) ద్వారా అర్జీ దారుల వినతులను స్వీకరించడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివా రం ఒక ప్రకటనలో తెలి పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం (పీజీ ఆర్ఎస్) ద్వారా అర్జీల స్వీకరణ ప్రక్రియ చేపట్ట నున్నట్టు తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాలలోను 4 మునిసిపల్ ప్రధాన కార్యాలయాలలోనూ 22మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తార న్నారు. ప్రజలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసు కోవాలని జిల్లాకలెక్టర్ తెలిపారు. అదేవి ధంగా అర్జీదారులు తమ అర్జీలను పిజిఆర్ఎస్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చుని, నమోదైన అర్జీల పరిష్కార స్థితిగతు లు సంబంధిత సమాచా రం తెలుసుకు నేందుకు 1100 కి నేరుగా ఫోన్ చేసి సంప్రదించవ చ్చునని తెలిపారు. కావున అర్జీదా రులు జిల్లా, డివిజన్, మండల నిర్దేశిత స్థాయిల లోనీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలను ఆశ్రయించి తమ తమ సమస్యలకు తగు పరి ష్కార మార్గాలు పొందాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

# 16 సామర్లకోటలో జరిగే సీపీఐ

ప్రజా ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయండి.....

.....ఎన్నికల హామీలు , స్మార్ట్ మీటర్లు రద్దుకై విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కాకినాడ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం మహాసభలో తీర్మానాలు.....

...సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు....




**సామర్లకోట :విశ్వం వాయిస్ న్యూస్**ఐభారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కాకినాడ జిల్లా ద్వితీయ మహాసభలు ఈనెల 16 17 తేదీలలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన పట్టణమైన సామర్లకోట లో జరుగుతున్నాయని 16వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక నాగుల చెరువు గట్టు వద్ద బహిరంగ సభ జరుగుతుందని అక్కడి నుండి మెయిన్ రోడ్డు మీదగా గాంధీ బొమ్మ వరకు ప్రదర్శన జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు ప్రకటించారు ఆదివారం ఉదయం స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో మహాసభల సన్నాహక సమావేశం పట్టణ కార్యదర్శి పి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగ ప్రభాకర్ జాతీయ సమితి సభ్యులు పి దుర్గా భవానిలు హాజరవుతున్నారని ఆయన తెలిపారు కాకినాడ జిల్లాలో ఉన్న విద్యార్థి యువజన కార్మిక రైతు వ్యవసాయ కూలీలు అన్ని వర్గాల ప్రతినిధులు హాజరవుతారని ఆయన ప్రకటించారు ఈ సమావేశంలో ముఖ్యంగా ఈ కూటమి ప్రభుత్వం ఎన్నికల ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చే విధంగా ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని అదేవిధంగా వినియోగదారులకు నష్టం చేకూర్చే స్మార్ట్ మీటర్లు రద్దు చేసే వరకు పోరాటాన్ని రూపొందిస్తామని ఆయన ప్రకటించారు పట్టణ ప్రజలకు రెండు సెంట్లు భూమి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల భూమి ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం కొనసాగుతుందని మధు ప్రకటించారు విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మిక సంఘాలతో కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని మధు తెలిపారు ఇంకా అనేక అంశాలపై తీర్మానాలు ఉంటాయన్నారు ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ మదగల రమణ సిపిఐ పట్టణ నాయకులు అర్జున్ రావు ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సూరిబాబు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నక్క శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు

# కాకర శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వేగుళ్ళ...

మండపేట మండలం...



**విశ్వం వాయిస్ న్యూస్...**ఐమండపేట మండలం అర్తమూరు పంచాయితీ 7వ వార్డు సభ్యుడు మండపేట నియోజకవవర్గ టిడిపి డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కాకర శ్రీనివాసరావు ఇటీవల గుండెపోటుతో మరణించటంతో ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటి చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అర్తమూరు లో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు. ఈ పరామర్శలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, తిరుపతి వెంకటేశ్వరా వెటర్నరీ యూనివర్శిటి పాలకమండలి మాజీ సభ్యులు పడాల సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి, బాబులు రెడ్డి, మల్లిడి సత్తిరాజు, చిర్ల వాసు, పంచాయితీ వార్డు మెంబర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హారిక పై దాడి రెడ్ బుక్ పాలనకు పరాకాష్ట.

వైసిపి నేత రమణారావు ఆగ్రహం.



**అమలాపురం రూరల్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం. కూటమి అధికారం చేపట్టాక వైఎస్సార్ సిపి నాయకులు కార్యకర్తలను ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నారని మహిళలని కూడా చూడకుండా దాడులు చేస్తున్నారని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైఎస్సార్ సిపి నాయకుడు కుంచే రమణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలాపురంలో రమణారావు ఆదివారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. రెడ్ బుక్ పాలన లో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక పై కూటమి గుండాలు గుడివాడలో దాడికి పాల్పడడం అత్యంత హేయమైన చర్యని రమణారావు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడి హీన సంస్కృతిని చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని ఇటువంటి అమానుష దాడులను చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మహిళలని కూడా చూడకుండా దాడులు చేస్తున్నారని కూటమి పాలన ఎమర్జెన్సీని తలపిస్తుందని ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రాష్ట్రంలో అటవిక పాలన సాగుతుందని చంద్రబాబు పాలన మహిళల పాలిట నరకాసురుల పాలనలా మారిందని బిసి మహిళా నాయకురాలు హారిక పై దాడి చేయడం అణగారిన వర్గాల పై దాడి చేయడమేనని మండిపడ్డారు. మహిళా ప్రజా ప్రతినిధి పై దాడి చేయడం ఒక మహిళ హోం మంత్రిగా ఉన్న రాష్ట్రంలో మహిళలపై దాడులు జరగడం అంటే హాస్యాస్పదంగా ఉందని రమణారావు విమర్శించారు. ఒక జెడ్పి చైర్ పర్సన్ స్థానంలో ఉన్న హారిక పై దాడి జరిగిందంటే రాష్ట్రంలో ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. పోలీసుల సమక్షంలోనే టిడిపి గూండాలు దాడికి పాల్పడడం సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి అమానుష దాడులను సహించేది లేదని రాష్ట్రంలో అటవిక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని రమణారావు హెచ్చరించారు.

## వాహనదారులకు డ్రైవింగ్ పట్ల అవగాహన తనిఖీ చేస్తున్న ఎస్సై నరేష్



**కొత్తపేట ఆలమూరు జూలై 13. విశ్వం వాయిస్ న్యూస్.** ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్ లో ఎస్ఐ నరేష్ వాహనాలను తనిఖీ చేశారు. అంతేకాకుండా వాహనదారులకు డ్రైవింగ్ పట్ల అవగాహన వాహనాలకు సంబంధిత పేపర్లు డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని హెల్మెట్ కూడా ధరించి వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా కాపాడుకోవాలని తెలిపారు. కొత్తూరు సెంటర్ లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా దుకాణదారులు చూసుకోవాలని హెచ్చరించారు.

## వకుళమాత అన్నదానం భవన నిర్మాణానికి విరాళం



కొత్తపేట ఆత్రేయపురం జూలై 13. విశ్వం వాయిస్ న్యూస్. కోనసీమ తిరుపతి వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నకు రాజమండ్రి వాస్తవ్యులు ఫోమ్ర మధుసూదన్, కిరణ్ దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు 51,111/-రూపాయలు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వకుళమాత అన్నదానం భవన నిర్మాణానికి విరాళంగా సమర్పించినారు అని డిప్యూటీ కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి నల్లం చక్రధర్ రావు తెలియజేశారు.

## అన్నదాన పథకమునకు విరాళం




కొత్తపేట ఆత్రేయపురం జూలై 13. విశ్వం వాయిస్ న్యూస్.ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారిని దర్శించుకొని స్వామి వారి కి నల్గొండ వాస్తవ్యులు దేవసాని ఇందిర సౌమ్య, బచ్చు జలజ వారి జ్ఞాపకార్థం స్వామి వారి అన్నదాన పథకమునకు రూ. 5,116/-లు విరాళంగా సమర్పించియున్నారు దాతకు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించడమైనది అని కార్యనిర్వాహణాధికారి తెలియజేశారు.

## ఉయ్యూరివారి మెరకలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'కార్యక్రమంలో

బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లి బోయిన

టిడిపి మీడియాకు ఆర్డినేటర్ బోళ్ళసతీష్



**సఖినేటిపల్లి మండలం విశ్వం వాయిస్ న్యూస్** కూటమి ఏడాది పాలనలోనే ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి అనే రెండు అంశాల్లో ఎన్నో విజయాలు సాధించామని టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు చెప్పారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం ఉయ్యూరివారి మెరక మధ్య గ్రూపులో ఆదివారం నాడు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీనివాస్, సతీష్ బాబు ఇంటింటికి వెళ్లి కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ అరాచక పాలన వల్ల రాష్ట్రం అధోగతి పాలైందని, కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్ది ఏడాది పాలనలోనే పింఛన్ మొత్తాన్ని రూ. 4 వేలకు పెంపు, తల్లికి వందనం, దీపం, మెగా డీఎస్సీ వంటి హామీలు ప్రతిష్టాత్మకంగా అమలు చేసిందని తెలిపారు. 'అన్నదాత సుఖీభవ' పథకం అమలుకు కసరత్తు పూర్తయిందని, పీఎం కిసాన్ పథకంతో పాటు నగదు జమవుతుందని తెలిపారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు జరుగుతుందన్నారు. ఈ విధంగా ' సూపర్ సిక్స్' హామీల్లో ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు కూటమి ప్రభుత్వం శతధా కృషి చేస్తుందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సైతం కూటమి ప్రభుత్వం పరుగులు పెట్టిస్తుందని తెలిపారు. పల్లెల్లో వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని వారు తెలిపారు. అందుకే సుపరిపాలనలో తొలి కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, టిడిపి నాయకులు తాడి సత్యనారాయణ, చెల్లుబోయిన జయబాబు, చెల్లుబోయిన నాగబాబు, సుంకర అమర జ్యోతి కుమార్, సుంకర సూర్యనారాయణ, హరరాజు, సుధాకర్, సలాది దొరబాబు తదితరులు పాల్గొన్నారు

# అధిక ఉప్పు.. ఆరోగ్యానికి నిప్పు

**ఇంటర్నెట్ డెస్క్:** దేశంలో మోతాదుకు మించి ఉప్పు వినియోగం ఉంటోందని, దీని ప్రతికూల ఫలితాలు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయని తాజా అధ్యయనం పేర్కొంది. హైపర్‌టెన్షన్, స్ట్రోక్, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారిలో ముప్పు మరింత పెంచుతోందని ఐసీఎంఆర్‌కు చెందిన 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమిడమాలజీ' శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఉప్పు వినియోగం తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా అధ్యయనం చేయడంతో పాటు తక్కువ సోడియం ఉన్న ప్రత్యామ్నాయ ఉప్పుపై దృష్టి సారిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం.. ఓ వ్యక్తి రోజులో 5గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవాలి. కానీ, భారత్‌లో పట్టణ ప్రాంతాల ప్రజలు రోజుకు 9.2 గ్రాములు తీసుకుంటుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఈ వినియోగం 5.6 గ్రాములుగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.



**సోడియానికి బదులు..**

ఉప్పులోని సోడియం క్లోరైడ్‌లో కొంతభాగాన్ని పొటాషియం లేదా మెగ్నీషియం లవణాలతో భర్తీ చేయడం ఆశాజనకంగా కనిపిస్తోందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ఎన్‌ఐఈ సీనియర్ శాస్త్రవేత్త డా.శరణ్ మురళి పేర్కొన్నారు. సోడియం తక్కువ తీసుకోవడం.. రక్తపోటును తగ్గించడంతో పాటు గుండె పనితీరును మెరుగుపరుస్తుందన్నారు. ముఖ్యంగా హైపర్‌టెన్షన్‌తో బాధపడేవారికి ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. రక్తపోటు దాదాపు 7/4 ఎంఎంహెచ్‌జీ తగ్గుతుందని.. ఈ చిన్న మార్పు చాలా పెద్ద ప్రభావం చూపుతుందన్నారు.

**అధిక ఉప్పు.. ఆరోగ్యానికి నిప్పు**

ఐసీఎంఆర్ సాయంతో తెలంగాణ, పంజాబ్‌లలో మూడేళ్ల వ్యవధితో కూడిన అధ్యయనాన్ని ఎన్‌ఐఈ ప్రారంభించింది. రక్తపోటు ఉన్న వ్యక్తుల్లో ఉప్పు తగ్గింపు ప్రభావాన్ని అంచనా వేయడం, దీనిపై కౌన్సిలింగ్ ఇవ్వడం వంటి లక్ష్యాలతో దీన్ని చేపట్టినట్లు డా.గణేశ్ కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం అధ్యయనం తొలి ఏడాదిలో ఉందని, క్షేత్రస్థాయి సన్నద్ధత, అంచనాలపై పనిచేస్తున్నామని చెప్పారు. దీనిపై గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలతో కలసి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

**లభ్యత తక్కువే..**

మార్కెట్‌లో తక్కువ సోడియం ఉప్పు లభ్యత? ధర ఎలా ఉందనే దానిపై చెన్నైలో 300 రిటైల్ దుకాణాల్లో ఎన్‌ఐఈ సర్వే చేపట్టింది. 28శాతం రిటైల్ దుకాణాల్లో, 52 శాతం సూపర్ మార్కెట్లలో లభ్యమవుతుండగా.. కేవలం 4శాతం చిన్న కిరాణా దుకాణాల్లోనే ఇది అందుబాటులో ఉన్నట్లు తేలింది. అంతేకాదు, సాధారణ ఉప్పు ధర 100గ్రాములకు రూ.2.7 ఉండగా.. ఎల్‌ఎస్‌ఎస్ ధర రూ.5.6గా ఉందని వెల్లడైంది. తక్కువ సోడియం కలిగిన ప్రత్యామ్నాయాలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు

# కాంగ్రెస్ కీలక సమావేశానికి సోనియా పిలుపు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజిక్ గ్రూప్ సమావేశం ఈనెల 15న జరుగనుంది. దీనికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అధ్యక్షత వహించనున్నారు. సోనియాగాంధీ తన నివాసమైన 10, జన్‌పథ్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు పాల్గొనున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈసారి అధికార, విపక్షా పార్టీల మధ్య వాడివేడిగా జరిగే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్



చేపట్టడంపై తీవ్ర ఆందోళన చేస్తున్న విపక్షాలు ఈ అంశాన్ని ఉభయసభల్లోనూ ప్రస్తావించే అవకాశాలున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తరువాత జరుగుతున్న తొలి సమావేశాలు కావడంతో ఈ అంశాలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని కాంగ్రెస్ భావిస్తోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 21న ప్రారంభమై ఆగస్టు 21తో ముగియనున్నాయి. తొలుత ఆగస్టు 12తో సమావేశాలు ముగుస్తాయని ప్రకటించినప్పటికీ ఆ తర్వాత మరో వారం రోజులు పొడిగించాలని ప్రభుత్వ నిర్ణయించింది. దీంతో లెజిస్లేటివ్ ఎజెండా ఎక్కువగానే ఉండచ్చని తెలుస్తోంది. ఆటమిక్ ఎనర్జీ రంగంలో ప్రైవేటురంగానికి మార్గం సుగమం చేసే కీలక చట్టాన్ని ఈ సమావేశాల్లో తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది.

## పాస్‌పోర్ట్, వీసా లేకుండానే విమానంలో సౌదీకి..

# ఎయిర్‌లైన్ కంపెనీకి ప్రయాణికుడి లీగల్ నోటీసులు!

పాక్‌లోని లాహోర్‌కు చెందిన షాజాహాన్ అనే యువకుడు కరాచీ వెళ్లేందుకు విమానంలో బయలుదేరాడు. పొరపాటున సౌదీ అరేబియాలోని జెడ్డాకు చేరుకున్నారు. ఎయిర్‌లైన్స్ కంపెనీ నిర్లక్ష్యం కారణంగానే తాను జెడ్డా నగరానికి చేరుకోవాల్సి వచ్చిందని ఆరోపించాడు. టికెట్ చెక్ చేసిన సమయంలో ఎయిర్ హోస్టెస్ తనను మరో విమానం ఎక్కే సమయంలో ఇంటర్నేషనల్ ఫ్లైట్ ఎక్కకుండా అడ్డుకోలేదని ఆరోపించాడు. డొమెస్టిక్ టెర్మినల్ వద్ద రెండు విమానాలు నిలిచి ఉన్నాయని.. తాను ఓ విమానానికి బదులుగా మరో విమానం ఎక్కినట్లు పేర్కొన్నారు. దాదాపు రెండుగంటల తర్వాత విమానం కరాచీకి చేరుకోకపోవడంతో సదరు ప్రయాణికుడు తన తప్పును తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది తనను నిందించారని సదరు వ్యక్తి పేర్కొన్నాడు. తనకు పాస్‌పోర్ట్ లేదని, వీసా లేకుండానే తాను సౌదీకి చేరానని చెప్పుకొచ్చాడు. ఎయిర్‌లైన్స్ నిర్లక్ష్యం కారణంగా సౌదీలో తాను అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. ఆ దేశంలో ఎఫ్‌ఐఏ అధికారులు తనను విచారించారని.. తాను తిరిగి కరాచీకి చేరుకునేందుకు మూడురోజుల సమయం పట్టిందని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో షాజాహాన్ ఎయిర్‌లైర్స్‌కు లీగల్ నోటీసు పంపాడు. ఎయిర్‌లైన్ తప్పు కారణంగా తనకు మానసికంగా, ఆర్థికంగా నష్టం జరిగిందని తెలిపాడు. అదనపు ప్రయాణఖర్చులు, అసౌకర్యానికి పరిహారం చెల్లించాలని



డిమాండ్ చేశాడు. లాహోర్ విమానాశ్రయం, పాకిస్తాన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ దర్యాప్తు ప్రారంభించారు. చెకింగ్, బోర్డింగ్ ప్రక్రియలో ఎయిర్‌లైన్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ సంఘటన ఒక వ్యక్తి ఇబ్బందులు పడడమే కాకుండా పాక్‌లో విమాన ప్రయాణ భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. పాస్‌పోర్ట్, వీసా లేకుండా విదేశాలకు ఓ ప్రయాణికుడు చేరుకోవడం ప్రత్యక్షంగా నిబంధనలు ఉల్లంఘించడమే. అయితే, ఇప్పటి వరకు ఎయిర్‌లైన్స్ స్పందించలేదు.

# భారత్‌తో బంధంలో ఓ సమస్య..దలైలామా వారసుడి ఎంపిక

**ఢిల్లీ:** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయం చైనా భారత్ సంబంధాలలో ఓ సమస్యగా మారిందని భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం పేర్కొంది. భారత్‌లోని కొందరు వ్యక్తులు దలైలామా వారసత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. భారత విదేశాంగ నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వాన్ని పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా చైనా అంతర్గత వ్యవహారమని..ఇందులో భారత్ కల్పించుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు ఇటీవల ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యితో జైశంకర్ బీజింగ్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని తెలిపాయి. ఈ నేపథ్యంలో చైనా రాయబార కార్యాలయం నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం. దాదాపు ఆరు దశాబ్దాలుగా టిబెట్ నియంత్రణపై చైనాతో టిబెట్ బౌద్ధగురువు దలైలామాకు వివాదం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల మాట్లాడుతూ..చైనా బయటే తన వారసుడు జన్మిస్తాడని పేర్కొన్నారు.అది భారత్‌లో కూడా కావచ్చని



వ్యాఖ్యానించారు. తన వారసత్వంపై నిర్ణయం తీసుకునే హక్కు చైనాకు లేదని స్పష్టం చేశారు. అనంతరం దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోదముద్ర కావాలంటూ చైనా డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. ఇటీవల దలైలామా పుట్టిన రోజు వేడుకలకు హాజరైన భారత కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ..15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టం చేశారు

## ఏడాది సుపరిపాలన కార్యక్రమాన్ని ప్రతిష్టత్మకంగా చేపట్టాలి

టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం

విశ్వం వాయిస్ కాజులూరు



రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఏడాది సూపర్ పాలన కార్యక్రమాన్ని టిడిపి నాయకులు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని టిడిపి నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. మండల కేంద్రమైన కాజులూరులో టీడీపీ యూనిట్, బూత్ ఇన్చార్జ్ లు,టిడిపి నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వర్యులు వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ముఖ్యతిధిగా హాజరై టీడీపీ కార్యకర్తలు, నాయకులతోసమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా సత్యం మాట్లాడుతూ కాజులూరు మండల గ్రామాల్లో బూత్ స్థాయిలో వెనుకబడిన కార్యకర్తలు పనితీరును మెరుగుపరచాలని సూచించారు. వేగవంతంగా క్షేత్రస్థాయి సూపర్ పాలన కార్యక్రమాన్ని పూర్తిచేసిన యూనిట్, బూత్ ఇన్చార్జ్ లను ఆయన అభినందించారు. ప్రతి ఒక్కరు కూడా ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యకర్తలు, నాయకుల పనితీరును బట్టి వారికి పార్టీ లో ప్రాధాన్యత పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, మండల టీడీపీ అధ్యక్షుడు చావ్వాకుల నారాయణమూర్తి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు పేపకాయల బాబ్జి, టీడీపీ సీనియర్ నాయకులు వనుం వీరబ్రహ్మం, చంద్రు వీర్రాజుచౌదరి, బాబురావు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు పెద్ద, ప్రచార కార్యదర్శి శేషరావు, కొల్లు వెంకటేశ్వరరావు, చందాల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**ఆలమూరు( విశ్వం వాయిస్ న్యూస్):** మండల పరిధిలో చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. ఆలమూరు ఎస్సై జి.నరేష్ కథనం ప్రకారం శనివారం సాయంకాలం సుమారు 45 యేళ్ల వయస్సు కలిగిన వ్యక్తి చికిత్స నిమిత్తం వచ్చి లోపలికి వెళ్లకుండానే క్రింద పడిపోయి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు, అంతలో వైద్యారోగ్య సిబ్బంది హుటాహుటీన లోపలికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. దీనిపై వైద్యాధికారి ఎన్.లక్ష్మీ స్నేహలత ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్సై నరేష్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సదరు వ్యక్తి పసుపు నలుపు చారల టీ షర్టు, ముదర నీలం నిక్కర్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించేందుకు స్థానికుల సాయంతో ప్రయత్నిస్తున్నారు. మండపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో మూడు రోజుల పాటు మృతదేహాన్ని ఉంచనున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

## ఆర్పీఎఫ్ తొలి మహిళా సారధిగా సోనాలి మిశ్రా

**న్యూఢిల్లీ:** మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారు. భారత సైన్యంలోనూ ప్రవేశించి, తమ సత్తా చాటుతున్నారు. ఇప్పుడు సీనియర్ ఐపీఎస్ అధికారిణి సోనాలి మిశ్రా.. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా నియమితు లయ్యారు. జూలై 31న పదవీ విరమణ చేయనున్న మనోజ్ యాదవ్ స్థానంలో ఆమె ఈ పదవిని చేపడుతున్నారు. సోనాలి మిశ్రాను ఈ పదవిలో నియమించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ అధికారికంగా ఆమోదం తెలిపింది. సిబ్బంది మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం 2026, అక్టోబర్ 31 వరకూ అంటే పదవీ విరమణ చేసే వరకు సోనాలి మిశ్రా ఈ పదవిలో కొనసాగనున్నారు. రైల్వే ఆస్తులను కాపాడటం, ప్రయాణికుల భద్రత తదితర విధులతో పాటు, వాటి బాధ్యతలను అధికారులకు అప్పగించే విషయంలో ఆర్పీఎఫ్‌కు సోనాలీ మిశ్రా తొలి మహిళా అధికారిగా విధులు నిర్వహించనున్నారు. సోనాలి మిశ్రా మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన 1993 బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారిణి. ఆమె ప్రస్తుతం మధ్యప్రదేశ్ పోలీసు విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ (సెలక్షన్)గా పనిచేస్తున్నారు. కాగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)1957లో పార్లమెంటు చట్టం ప్రకారం ఏర్పాటయ్యింది. దీనికి 1985, సెప్టెంబర్ 20న యూనియన్ సాయుధ దళం హోదా ఇచ్చారు. 2021 జూలైలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఏర్పాటుకు నాయకత్వం వహించిన మొదటి మహిళా కమాండర్‌గా సోనాలి మిశ్రా పేరొందారు.

## కేరళ సీఎం నివాసానికి బాంబు బెదిరింపు!

కేరళ సీఎం పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు తంపనూరు పోలీస్ స్టేషన్‌కు మెయిల్ పంపారు. క్లిఫ్ హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయని ఆ ఈ-మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో సీఎం నివాసంలోని సెక్యూరిటీ సిబ్బంది పోలీసులు అప్రమత్తమయ్యారు. విస్తృతంగా తనిఖీలు చేసి అది ఫేక్ ఈ-మెయిల్‌గా తేల్చారు. బాంబు బెదిరింపు మెయిల్ రాగానే అధికారులు ముఖ్యమంత్రి నివాసాన్ని డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కానీ ఎలాంటి బాంబు జాడ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా తనిఖీల సమయంలో సీఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కీలక సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల వచ్చిన బెదిరింపు మెయిల్‌కు, తాజాగా వచ్చిన బెదిరింపు మెయిల్‌కు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## కోర్టు ఆదేశాలను సైతం లెక్కచేయని పంచాయితీ కార్యదర్శి

**తమ ఇంటి స్థలంలో బస్టాండ్ షెల్టర్ నిర్మించారంటూ ఆవేదన వ్యక్తం చేసిన బాధితుడు**



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కూనవరం గ్రామంలో కోర్టు ఆదేశాలను సైతం దిక్కరించి తమ స్థలములో అక్రమంగా పంచాయితీ సెక్రటరీ సుధాకర్ బస్సు షెల్టర్ నిర్మించారని ఈ నిర్మాణం వలన సొంత స్థలాన్ని కోల్పోయామని సుందరపల్లి శ్రీనివాస్ తన ఆవేదనను వ్యక్తం చేశారు. నాయి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారమనే చులకన భావంతో మమ్మల్ని కాపు వర్గానికి చెందిన వారు హేళన చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. సుందరపల్లి శ్రీనివాస్ తమ కుటుంబం గత 50 సంవత్సరాలుగా కూనవరం గ్రామంలో సర్వేనెంబర్ 95 లో నివసిస్తున్నామని,ఈ స్థలములో మూడు సెంట్లు భూమి శ్రీనివాస్ తల్లి సుందరపల్లి సావిత్రి పేరున పట్టా కూడా ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో పంచాయతీ సెక్రటరీ సుధాకర్ ఎటువంటి విచారణ లేకుండానే ముడుపులకు లోబడి పంచాయతీ తీర్మానం చేసి తన కుటుంబానికి చెందిన స్థలంలో బస్సు షెల్టర్ నిర్మించారని శ్రీనివాస్ ఆరోపించారు.ఈ అక్రమ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు శ్రీనివాస్ 2025 మే 26న కోర్టు ద్వారా పంచాయతీ సెక్రెటరీ కి ఎమ్మార్వో కార్యాలయానికి సబ్ కలెక్టర్ ఆర్ అండ్ బి అధికారులకు నోటీసులు జారీ చేశామని అన్నారు.అయితే కోర్టు ఆదేశాలను దిక్కరించి సెక్రటరీ కట్టడాన్ని పూర్తి చేయించారని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యారు కోర్టు ఆదేశాలను దిక్కరించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని సుందరపల్లి శ్రీనివాస్ కోరుతున్నారు. లేనిపక్షంలో తమ సొంత సామాజిక వర్గానికి చెందిన జిల్లా, స్టేట్ కమిటీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి తన నివాసం వద్ద నిరాహారదీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు.తనకు జరిగిన అన్యాయంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులకు ఇప్పటికే కలవడం జరిగిందని అన్నారు. న్యాయం జరగకపోతే రాబోయే రోజుల్లో మరింతగా నిరసనను ఉధృతం చేయడానికి వెనుకాడ బోమని తెలియజేశారు.

## పోలేకుర్రులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**తాళ్లరేవు, విశ్వంవాయిస్ ప్రతినిధి:** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలంలోని పోలేకుర్రు పంచాయతీ పరిధిలోని సంకటరేవు జై భీమ్ పేట గ్రామాల్లో ఆదివారం స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సి ఎస్ ఆర్ నిధులతో 30 లక్షల రూపాయలతో నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అనంతరం జై భీమ్ పేట మండల ఎస్సీ సెల్ నాయకులు జక్కల ప్రసాద్ బాబు ఆధ్వర్యంలోగ్రామంలో తల్లికి వందనం కృతజ్ఞత సభకు హాజరయ్యారు. ఎమ్మెల్యేను స్థానిక నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు సత్కరించారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లికి వందనం కార్యక్రమం ప్రారంభించి ఇంటిలో ఉన్న ప్రతి విద్యార్థికి ఎంతమంది ఉంటే అంత మందికి పథకం అమలయ్యేలా చర్యలు తీసుకున్నమని, గత ప్రభుత్వంలో అయితే ఇంట్లో ఇద్దరు ముగ్గరు పిల్లలు ఉన్న ఒకరికి మాత్రమే ఇచ్చేవారని కానీ కూటమి ప్రభుత్వంలో ఒకే ఇంటిలో ఐదుగురు పిల్లలున్న ఆరుగురు పిల్లలున్న అందరికీ పథకం వర్తింపజేసామని గుర్తు చేశారు.స్థానిక గ్రామంలోని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో కూటమి నాయకులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జక్కల ప్రసాద్ బాబు, మందాల గంగ సూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి బాబి, వాడ్రేవు వీరబాబు, వడ్లమూరి సతీష్, సాధనాల వెంకట శివరామకృష్ణ, సాధనాల ప్రసాద్, వూడా రాంబాబు, పోల్నాటి సుభాష్,పినిపే నాగేంద్రరావు, తాళ్ళరేవు, పి మల్లవరం, పోలేకుర్రు పంచాయతీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాణిక్యాంబ అమ్మవారికి ఆషాడం సారే



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్** రామచంద్రాపురం మండలం ద్రాక్షారామం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం నందు 12వ శక్తిపీఠమైన శ్రీ మాణిక్యాంబ అమ్మవారు శాకాంబరి దేవిగా ఆదివారం నాడు దర్శనం భక్తులకు ఇచ్చియున్నారు. అమ్మవారికి ఆషాడ మాసంలో సారెను దేవస్థానం వారు అమ్మవారి పుట్టినిల్లు అయినటువంటి వేగయమ్మ పేట గ్రామం నుండి శోభాయాత్రగా మంగళ వాయిద్యాలతో వేదమంత్రాలతో సమర్పించారు.మరియు వేలం పాలెం గోగులమ్మ అమ్మవారికి ద్రాక్షారామ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం నుండి సారిని ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ మరియు సత్యం ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం మరియు పోలిశెట్టి చంద్రశేఖర్,వేగాయమ్మ పేట జమీందారు వాడ్రేవు సుందర రత్నాకర్ శర్మ, ద్రాక్షారామ గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ మరియు భక్తులు,గ్రామస్తులు సేవా సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.భక్తులకు ఏ ఇబ్బంది కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారిని అల్లు వెంకట దుర్గా భవాని తగు ఏర్పాట్లు చేశారు.

## జెడ్పి చైర్ పర్సన్ ఉప్పాల హారికపై దాడి హేయనీయం

తెలుగుదేశం గుండాల రాళ్లదాడి పరాకాష్ట
పోలీసుల సమక్షంలోనే దాడికి తెగబడడం దారుణంలి
అసలు ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా
ఏడాదిగా రెడ్ బుక్ రాజ్యాంగం పేరిట వైసిపి శ్రేణులపై వేధింపులు
అప్పుడు పర్యవసానాలు కూడా తీవ్రంగానే ఉంటాయి
ఉప్పాల హారికకు అన్నివిధాలా అండగా ఉంటాం
రాజమండ్రి మాజీ ఎంపీ భరత్



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** కృష్ణాజిల్లా జెడ్పి చైర్ పర్సన్ బిసి మహిళ ఉప్పాల హారికపై తెలుగుదేశం గూండాలు రాళ్లదాడి తెగబడడం దారుణమని వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తీవ్రంగా ఖండించారు. భార్యాభర్తలిద్దరూ కారులో వెళ్తుంటే రాళ్లతో దాడి చేయడం, అది కూడా పోలీసుల సమక్షంలో జరగడం చూస్తుంటే,అసలు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందని ఆయన వాపోయారు. మనం ఆంధ్ర ప్రదేశ్ లోనే ఉన్నామా లేక పాకిస్తాన్ లో ఉన్నామా అన్నట్టుగా వ్యవహారం ఉందని భరత్ పేర్కొన్నారు. నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం ప్రకారం ఏడాదిపైగా వైసిపి శ్రేణులపై వేధింపులకు పాల్పడుతూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వేలాదిమంది కార్యకర్తలపై, నాయకులపై దాడులు చేస్తున్నారని,ఈవేళ నాటిన విత్తనం రేపొద్దున మహా వృక్షమై పర్యవసానాలు ఎలా ఉంటాయో ఒకసారి ఆలోచన చేసుకోవాలని భరత్ హెచ్చరించారు. ఎల్లకాలం ఒకరే అధికారంలో ఉండబోరని గుర్తుంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఉప్పాల హారికకు పూర్తిస్థాయిలో తాము అండగా ఉంటామని, జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే నిలబడతామని కూడా చెప్పారని భరత్ పేర్కొన్నారు.

## కత్తితో హత్యాయత్నం



**కాకినాడ రూరల్(కరప):** విశ్వం వాయిస్ న్యూస్. కరప కి చెందిన బేరి చంద్ర శేఖర్ అతని చిన్నాన్న బేరి రామకృష్ణ కి ఆస్తి తగాదాలు ఉన్నాయి. బేరి రామకృష్ణ కొడుకు మావయ్య అమజాల వీర రాఘవ్ బిక్కవోలు లో ఉంటాడు. బాధితుడు తన అల్లుడు కి సపోర్ట్ గా ఉంటున్నాడని ముద్దాయి బేరి చంద్రశేఖర్, అతని తల్లి రెండు రోజుల క్రితం రాజీ చేసుకోవచ్చని ఫోన్ చేసి పిలిచారు. ఆదివారం వారి బంధువుల ఫంక్షన్ కి వచ్చినప్పుడు మాట్లాడదామని బాధితుడు చెప్పాడు. ఆదివారం వీరరాఘవ్ అతని కుటుంబ సభ్యులు కరప వచ్చారు. తన అల్లుడు ఇంటి దగ్గరకు వచ్చే సరికి హత్య చేయాలనే ఉద్దేశ్యం తో ఉన్న చంద్రశేఖర్, అతని తల్లి కత్తితో ఎదురు చూస్తున్నారు.ముందు గా ఆ ఇంటికి ఉన్న సిసి కెమెరా బద్దలు గొట్టారని , తర్వాత వీరరాఘవ్ ఇంటి దగ్గరకు రాగానే ముద్దాయి తల్లి వీరరాఘవ్ చేతులు పట్టుకోగా చంద్రశేఖర్ కత్తితో మెడ నరక బోతుండగా అతను ఆమె నుండి వదిలించుకుని చేయి అడ్డు పెట్టగా కుడి చేయి , భుజం పై రెండు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. చంద్రశేఖర్ నరికడమే కాకుండా ఎవరికో ఫోన్ చేసి పోలీస్టేషన్లో మేనేజ్ చేయమని చెప్పడాని వీరరాఘవ్ చెప్తున్నాడు. వీరరాఘవ్ ని స్థానికులు హుటాహుటిన జిజిహెచ్ కి తరలించారు. ప్రస్తుతం అతనికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు

## మల్లి శాలలో ఘనంగా "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం

ఇంటింటికీ సంక్షేమ పథకాలపై కరపత్రాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట: విశ్వం వాయిస్ న్యూస్** జగ్గంపేట మండలానికి చెందిన మల్లి సాల గ్రామంలో ఆదివారం "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని క్లస్టర్ ఇంచార్జ్ పైడిపాల సూరిబాబు నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జగ్గంపేట శాసన సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై ప్రజల్లో చైతన్యం కలిగించేలా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో నెలకొన్న కూటమి ప్రభుత్వం గత ఏడాదిలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో అనేక కీలక నిర్ణయాలు తీసుకుని అమలు చేసిందని పేర్కొన్నారు. "తల్లికి వందనం", గృహాల మంజూరు, ఇంటి స్థలం కల్పన, ఎన్టీఆర్ పెన్షన్ వంటి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల్లోకి చేరవేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తూ, భవిష్యత్తులో అమలు చేయవలసిన కార్యక్రమాలపై తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు, ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమం గొప్ప వేదికగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే సుసంపన్నమైన పాలన సాధ్యమని, అందుకు అందరూ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, పైడిపాల సత్తిబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, కానవరెడ్డి రామకృష్ణ, పల్లికొండ భద్రం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుమ్మల్ల అనంతలక్ష్మి, ముత్తా రాజబాబు, సియాధుల పెద్దకాపు, కానవరెడ్డి శ్రీను, చాట్ర జగ్గారావు, జొన్నాడ వీరబాబు, జాజుల శ్రీను, సియాధుల శివరామకృష్ణ, బొమ్మిడి చక్రం తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**రామచంద్రపురం విశ్వం వ్వాయిస్ న్యూస్** 1989 -90 విద్యార్థుల బ్యాచ్ అనేక సంవత్సరాల పూర్వ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పటి విద్యార్థులలో చాలామంది సాఫ్ట్వేర్ ఇంజినీర్లు, లాయర్లు, డాక్టర్లు, సర్పంచులు, ఇండస్ట్రియల్ అధినేతలుగా ఎదిగినవారు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం రామకృష్ణ ఉన్నత పాఠశాలలోని సరస్వతి అమ్మవారి విగ్రహానికి పూజలతో జరిగింది. అనంతరం వీరందరూ ర్యాలీగా శ్రీ మాధవానంద ఫంక్షన్ హాల్కు చేరుకున్నారు. అక్కడ అప్పటి తీపి జ్ఞాపకాలను పంచుకుంటూ, ముందు ఎలా ఉండేవారము ఇప్పుడు ఎలా ఉన్నామో అనే విషయాన్ని ఆనందంగా అందరూ కలిసి చర్చించుకున్నారు. విధి వశాత్తూ ఈరోజు వారి మధ్య లేనటువంటి 15 మంది పాత విద్యార్థులను స్మరించుకుంటూ, మౌనం పాటించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు భరోసా కూడా తెలియజేశారు. పలువురు మాట్లాడుతూ మన బ్యాచ్లో ఎవరైనా ఇంకా జీవితంలో స్థిరపడకపోతే, వారు సంబంధించిన వివరాలు తెలియజేసినట్టు అయితే అవకాశముంటే మనం కలిసి వారికి సహాయం చేయాలి అని ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు తోట పుండరీకాక్షలు, యండమూరి ఈశ్వరరావు సంగీతం రామకృష్ణ, సత్యారం, పంపన గోవిందు, చెరుకురగు పిల్లా వెంకటరావు, టేకుమోడీ, సత్యనారాయణ, రాజేశ్వరి, నాగు, ధనలక్ష్మి, అమ్మాడి అన్వరీ, భాను మరియు ఇతర పలువురు ముఖ్య సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో విశేషంగా ఆకర్షణగా నిలిచిన వారు అమెరికా ఫ్లోరిడాలో స్థిరపడిన పెట్టిన రమేష్, భాగవతి గోపి వంటి సాఫ్ట్వేర్ ఇండస్ట్రీ అధినేతలు అయిన టేకుమూడి సత్యనారాయణ,ఆయన సతీమణి సుజాత, నాగిరెడ్డి సతీష్ రావ్ వంటి ప్రజాప్రతినిధులు సర్పంచులు వున్నారు.అయితే ఎంతో ఉన్నత స్థానాలకు చేరుకుని స్థిరపడిన వాలందరు చూస్తుంటే సంతోషంగా ఉన్నదని మిగతా వాళ్ళు అన్నారు. ఇలాంటి మరెన్నో పూర్వ విద్యార్థుల సంఘటనలు తరచూ జరగాలని, మరింత బంధాన్ని పెంచాలని సమావేశం ముగింపులో నిర్ణయించు కున్నారు.

## శ్రీ సత్య సాయి డ్రింకింగ్ వాటర్ కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలి



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ఉన్నటువంటి శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లై కార్మికులకు 19 నెలలుగా జీతాలు మరియు 25 నెలలుగా ఈఎస్ఐ మరియు పిఎఫ్ వంటివి చెల్లించాలని ది 2025 జూలై 8వ తారీఖు నుండి రాజమండ్రి లాలాచెరువు వద్ద ఉన్న ఆర్డబ్ల్యూఎస్ అండ్ ఎస్ ఈఈ ఆఫీసు వద్ద నిరవధిక సమ్మె చేస్తున్నామని ఈ సమ్మె కారణంగా సుమారు 85 గ్రామాల ప్రజలు ఐదు రోజులుగా మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ,ఐదు రోజుల నుండి సత్యసాయి కార్మికులు సమ్మె చేస్తున్నా కాంట్రాక్టర్ గాని అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవని ,ఒక ప్రక్క సుపరిపాలన అంటూనే ప్రజలకు మంచినీరు గాని కార్మికులకు జీతాలు గాని లేకుండా పాలన చేస్తున్నారని, మా సమస్యలను పట్టించుకోకపోతే మా సమస్యలను గ్రామాల్లో ఉన్న ప్రజల వద్దకు తీసుకువెళ్లి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్డబ్ల్యూఎస్ మరియు సిపిడబ్ల్యూఎస్ స్కీములు కార్మికుల మద్దతుతో ఈ యొక్క సమ్మెను మరింత తీవ్రతరం చేస్తామని అన్నారు. ఈ సమ్మెకు మద్దతుగా ఆర్డబ్ల్యూఎస్ మరియు సి పి డబ్ల్యూ స్కీమ్స్ రాష్ట్ర యూనియన్ సభ్యులు రాయుడు శ్రీను, సిఐటియు జిల్లా జనరల్ సెక్రటరీ బి.పవన్, పూర్ణిమ రాజు తమ మద్దతును తెలియజేసారన్నారు. దయచేసి మా ఆవేదన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అర్థం చేసుకుని మా యొక్క సమస్యకు పరిష్కారం దయచేయలని కోరుతున్నామన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులుగా గంగాధర్



కాకినాడ నియోజకవర్గం సిటీ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులుగా కాకినాడ సిటీ బిజెపి పార్టీ కో కన్వీనర్ కొండేటి గంగాధర్ నియమితులయ్యారు. గంగాధర్ ఆయన స్వగృహం నందు మీడియాతో మాట్లాడుతూ కాకినాడ అర్బన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు గా అవకాశం కల్పించిన పెద్దలు గౌరవ శాసన సభ్యులు వనమాడి కొండబాబు బీజేపీ రాష్ట్ర అద్యక్షులు పివిఎన్ మాధవ్ రాష్ట్ర మంత్రి మధుకర్ కి రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి పూర్వ రాష్ట్ర అద్యక్షులు శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు బీజేపీ ఎమ్మెల్యేలకు ఎంపీ లకు ఓబీసీ రాష్ట్ర అద్యక్షులు రోంగాల గోపి శ్రీనివాస్ కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వర రావు, బొచ్చు రాజేష్ కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన బీజేపీ జిల్లా పెద్దలకు, నన్ను అభిమానించే నా శ్రేయోభిలాషులకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి గైనిక్ సదస్సు....




**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్** ఆంధ్రప్రదేశ్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఒబిస్ట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ(ఏపీసి ఓజి) ఆధ్వర్యంలో స్థానిక రంగరాయ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సైంటిఫిక్ ప్రోగ్రాం ఆదివారంతో ముగిసింది. ఈ సదస్సుకు సుమారు 1300 మంది వైద్యులు ఆంధ్ర, తెలంగాణలతో పాటుగా 15 మంది జాతీయ స్థాయిలో హాజరయ్యారు. ఈ సదస్సులో నూతన ప్రసూతి వైద్య విధానంపై చర్చించారు. అలాగే వైద్య రంగంలో వస్తున్న ఆవిష్కరణలను చర్చించారు. నూతన ఆలోచనలతో శస్త్ర చికిత్స చేసే విధానాలను వివరించారు. కుట్టు కోత లేకుండా శస్త్ర చికిత్స చేసే విధానాలను వివరించారు. కోలా శశికళ, పద్మశ్రీ మంజుల అనగాని, కలకత్తాకు చెందిన భాస్కర్ షా, శాంతకుమారిలు నూతన వైద్య విధానంపై బోధించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ ఎస్ లావణ్య కుమారి, ఏపీ ఏపీ సి ఓ జి కాకినాడ సభ్యులు వైద్యులు వై అనురాగమయి, వి గీతశ్రీ, లక్ష్మీ కిరణ్, రవికుమార్, శ్రీధర్, సత్యవతి, కొండమూరి సత్యనారాయణ, సరస్వతి తదితరులు హాజరయ్యారు.

## నామవానిపాలెం సర్పంచ్ సూర్య నారాయణరాజు మృతి పట్ల మంత్రి సుభాష్ సంతాపం



రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్:- రామచంద్రపురం నియోజకవర్గం నామవానిపాలెం గ్రామ సర్పంచ్ సి హెచ్ సూర్యనారాయణ రాజు అకాల మరణం పట్ల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి కన్నీటి పర్యంతమయ్యారు.బి. హెచ్.సూర్యనారాయణ రాజు అందరితో కలిసిపోయే మంచి స్వభావం ఉన్న మనిషిని, ఆయన పార్టీకి చేసిన సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయన్నారు. పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఆయన భౌతిక కాయం పై తెలుగుదేశం పార్టీ కండువాను కప్పి గౌరవించారు.మంత్రి సుభాష్ వెంట పలువురు కూటమి నాయకులు కూడా పాల్గొని సర్పంచ్ మృతికి సంతాపం తెలియజేశారు.


# చర్మ కాంతిని పెంచే అద్భుతమైన పోషకాహారం!



: చర్మ ఆరోగ్యం లేకుండా ఆరోగ్యం లేదు. ఇది మన సంపూర్ణ ఆరోగ్యానికి చర్మ సౌందర్యానికి ఉన్న ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. చర్మ సంరక్షణ అనేది కేవలం శరీరంపైపూత క్రీమ్స్ పూయడం కాదని, ఇది లోపలి నుంచి, మన రోజువారీ ఆహార ఎంపికలతో ప్రారంభమవుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో, విటమిన్ "ఇ", ఆరోగ్యకరమైన కొవ్వులతో సమృద్ధిగా ఉండే కాలిఫోర్నియా బాదం వంటి ఆహారాలు చర్మ ఆరోగ్యానికి అద్భుతమైన మద్దతు అందిస్తాయని డా. గీతిక మిట్టల్ గుప్తా, మాక్స్ హెల్త్‌కేర్‌కు చెందిన రితికా సమద్దర్ వంటి నిపుణులు, ప్రముఖ తారలు సోహా అలీ ఖాన్, శ్రియా శరన్‌లు వెల్లడిస్తున్నారు. బాదంలో ఉండే 15 ముఖ్యమైన పోషకాలు, ముఖ్యంగా విటమిన్ "ఇ", యాంటీ-ఏజింగ్ లక్షణాలను కలిగి ఉండి, ముడతలను నివారించడంలో సహాయపడతాయి. ఆయుర్వేదం, సిద్ధ, యునాని వంటి సాంప్రదాయ పద్ధతులు కూడా బాదంను చర్మ కాంతికి, ఆరోగ్యానికి ప్రాచీన కాలం నుండి గుర్తిస్తున్నాయి. అంతేకాకుండా, బాదంను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల యువీబీ కిరణాల నుంచి రక్షణ లభిస్తుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. బాదం పప్పులు కేవలం పోషకాలకు నిలయమే కాదు, వాటిని రకరకాలుగా ఆహారంలో చేర్చుకోవచ్చు. నేరుగా తినడం, నానబెట్టుకుని లేదా వేయించుకుని తినడం, స్మూతీలు, సలాడ్‌లు, డెజర్ట్‌లు,సాంప్రదాయ వంటకాలలో జోడించడం ద్వారా సులభంగా మీ రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవచ్చు. -ooooooooఈ ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా, కాలిఫోర్నియా బాదం వంటి చర్మ-స్నేహపూర్వక ఆహారాలను మన రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన, మెరిసే చర్మం కోసం పోషణ అవసరాన్ని గుర్తించాలని, ఫిట్‌నెస్ మాస్టర్ యాస్మిన్ కరాచీవాలా చెప్పారు. జంక్ ఫుడ్ తినాలనే కోరికలను అరికట్టడంలో కూడా బాదం అద్భుతంగ ఉపయోగపడుతుందని వారు అంటున్నారు.

# పచ్చి బొప్పాయిని ఇలా తీసుకుంటే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు




పచ్చి బొప్పాయి ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో మనందరికీ తెలిసిందే. ఇది విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లతో నిండి, జీర్ణక్రియను మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం వంటి ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. అయితే, దీనిని సరైన పద్ధతిలో ఆహారంలో చేర్చుకుంటే మరిన్ని అద్భుతమైన ఫలితాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పచ్చి బొప్పాయిని మీ రోజువారీ డైట్‌లో సమర్థవంతంగా ఎలా భాగం చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం..

**పచ్చి బొప్పాయిని ఆహారంలో చేర్చుకోవడానికి ఆరు అద్భుతమైన మార్గాలు..**

పచ్చి బొప్పాయిని రకరకాలుగా మీ వంటకాల్లో చేర్చుకోవచ్చు. ఇవి కేవలం రుచికరంగా ఉండటమే కాకుండా, దానిలోని పోషకాలను పూర్తిగా అందిస్తాయి. సలాడ్‌లలో: పచ్చి బొప్పాయిని సన్నగా తురిమి లేదా చిన్న ముక్కలుగా కట్ చేసి మీ రోజువారీ సలాడ్‌లలో కలుపుకోండి. దీనికి నిమ్మరసం, కొద్దిగా మిరియాల పొడి, ఉప్పు చేర్చితే రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం. థాయ్ స్టైల్ పచ్చి బొప్పాయి సలాడ్ ఒక అద్భుతమైన ఎంపిక. పరాఠాలు, రోటీలలో: గోధుమ పిండితో పరాఠాలు లేదా రోటీలు తయారు చేసేటప్పుడు, తురిమిన పచ్చి బొప్పాయిని పిండిలో కలిపి చేయండి. ఇది పరాఠాలకు ఒక ప్రత్యేకమైన రుచిని ఇవ్వడమే కాకుండా, పోషక విలువలను పెంచుతుంది. కూర లేదా సబ్జీగా: పచ్చి బొప్పాయితో కమ్మని కూర లేదా సబ్జీని తయారు చేసుకోవచ్చు. ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, అల్లం-వెల్లుల్లి పేస్ట్‌తో పాటు బొప్పాయి ముక్కలను వేసి వండితే రుచికరమైన కూర సిద్ధమవుతుంది. పప్పుతో కలిపి కూడా కూర చేసుకోవచ్చు. జ్యూస్ లేదా స్మూతీలలో: పచ్చి బొప్పాయిని చిన్న ముక్కలుగా కట్ చేసి, కొద్దిగా నీళ్లు లేదా కొబ్బరి నీళ్లు కలిపి జ్యూస్ చేసుకోవచ్చు. దీనికి కొద్దిగా తేనె లేదా పుదీనా ఆకులు జోడిస్తే రుచి మరింత బాగుంటుంది. మీ మార్నింగ్ స్మూతీలో కూడా దీన్ని చేర్చుకోవచ్చు. ఊరగాయ (పచ్చడి) రూపంలో: పచ్చి బొప్పాయితో చేసే ఊరగాయ చాలా రుచికరంగా ఉంటుంది. మామిడికాయ పచ్చడి మాదిరిగానే దీనిని కూడా తయారు చేసుకోవచ్చు. ఇది భోజనానికి అదనపు రుచిని అందిస్తుంది. తోరన్ (కేరళ వంటకం): కేరళలో ప్రసిద్ధి చెందిన 'తోరన్' వంటకంలో పచ్చి బొప్పాయిని తరచుగా ఉపయోగిస్తారు. తురిమిన బొప్పాయిని కొబ్బరి, ఆవాలు, కరివేపాకులతో కలిపి చేసే ఈ వంటకం అటు ఆరోగ్యకరంగా, ఇటు రుచికరంగా ఉంటుంది. పచ్చి బొప్పాయిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది, చర్మం నిగనిగలాడుతుంది, బరువు అదుపులో ఉంటుంది, ఎముకలు బలంగా మారతాయి, ముఖ్యంగా రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. కాబట్టి, ఈ ఆరు మార్గాలలో ఏదో ఒక పద్ధతిలో పచ్చి బొప్పాయిని మీ డైట్‌లో భాగం చేసుకొని పూర్తి ఆరోగ్య ప్రయోజనాలను పొందండి.

# కొల్లాజెన్ లోపాన్ని సహజంగా పరిష్కరించాలంటే.. ఈ చిట్కాలు పాటించండి




చర్మ సౌందర్యం, ఎముకల బలం, కండరాల దృఢత్వం.. అన్నింటికీ అవసరమైన కొల్లాజెన్ లోపిస్తే మన శరీరంలో కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. వాటిని సకాలంలో గుర్తించి, సహజ పద్ధతుల్లో ఈ లోపాన్ని అధిగమించవచ్చు. సహజంగా అధిగమించే మార్గాలను గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. విటమిన్ 'సి' సమృద్ధిగా తీసుకోండి: విటమిన్ 'సి' కొల్లాజెన్ ఉత్పత్తికి చాలా అవసరం. నారింజ, నిమ్మ, బొప్పాయి, కివి వంటి పండ్లు, బ్రోకలీ వంటి కూరగాయలు ఎక్కువగా తినండి. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం: గుడ్లు, చేపలు, పప్పులు, పాలు, మాంసం వంటి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం ద్వారా కొల్లాజెన్ ఉత్పత్తికి అవసరమైన అమైనో ఆమ్లాలు లభిస్తాయి. ఎండ నుంచి రక్షణ: సూర్యరశ్మిలోని యూవీ కిరణాలు కొల్లాజెన్‌ను దెబ్బతీస్తాయి. బయటకు వెళ్లేటప్పుడు సన్‌స్క్రీన్ ఉపయోగించండి, టోపీ ధరించండి. క్రమం తప్పకుండా వ్యాయామం: వ్యాయామం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, ఇది చర్మ ఆరోగ్యానికి, కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది.ధూమపానం మానేయండి: ధూమపానం కొల్లాజెన్‌ను దెబ్బతీసి, దాని ఉత్పత్తిని తగ్గిస్తుంది.ఒత్తిడిని తగ్గించుకోండి: అధిక ఒత్తిడి శరీరంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ధ్యానం, యోగా వంటి పద్ధతులతో ఒత్తిడిని తగ్గించుకోండి. ఈ లక్షణాలను గమనించినట్లయితే, వెంటనే మీ వైద్యుడిని సంప్రదించి తగిన సలహా తీసుకోవడం ఉత్తమం. సరైన ఆహారం, జీవనశైలి మార్పులతో కొల్లాజెన్ లోపాన్ని అధిగమించి ఆరోగ్యంగా ఉండవచ్చు.

# ఆలుగడ్డల జ్యూస్‌ను అంత తేలిగ్గా తీసుకోకండి.. ఎన్నో అద్భుతమైన లాభాలు ఉంటాయి!

ఆలుగడ్డలు అంటే చాలా మందికి ఇష్టమే. వీటితో రకరకాల వంటకాలను చేసి తింటుంటారు. కూరగా, వేపుడు, చిప్స్, బిర్యానీ వంటి వాటిల్లో ఆలుగడ్డలను ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే వీటితో జ్యూస్‌ను తయారు చేసి తాగితే ఎన్నో లాభాలు ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆలుగడ్డల జ్యూస్‌ను తాగితే పోషకాలు లభించడంతోపాటు పలు వ్యాధులను నయం చేసుకోవచ్చని వారు అంటున్నారు. 100 ఎంఎల్ ఆలుగడ్డల జ్యూస్‌ను సేవిస్తే అనేక పోషకాలను పొందవచ్చు. ఇందులో విటమిన్ సి అధికంగా ఉంటుంది. అలాగే విటమిన్లు బి9, బి6, పొటాషియం, ఐరన్, క్యాల్షియం, జింక్, ఫాస్ఫరస్, మాంగనీస్, కాపర్, పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాలు రాకుండా రక్షిస్తాయి.

**వాపులు, నొప్పులకు..**

ఆలుగడ్డల జ్యూస్‌ను సేవించడం వల్ల సహజసిద్ధమైన అంటాసిడ్ మాదిరిగా పనిచేస్తుంది. జీర్ణాశయంలో అధికంగా ఉత్పత్తి అయ్యే యాసిడ్ల పరిమాణం తగ్గుతుంది. దీంతో అసిడిటీ తగ్గుతుంది. జీర్ణాశయం, పేగుల గోడలు సురక్షితంగా ఉంటాయి. అల్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. ఆలుగడ్డల జ్యూస్ ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. ఈ జ్యూస్‌ను సేవిస్తుంటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆలుగడ్డల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువే. ముఖ్యంగా ఫినోలిక్ సమ్మేళనాలు, కెరోటినాయిడ్స్ ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్, రుమాటిజం, కీళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం పొందవచ్చు.

**రోగ నిరోధక వ్యవస్థకు..**

ఆలుగడ్డల జ్యూస్‌లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఈ జ్యూస్‌లో అధికంగా ఉండే జింక్ రోగ నిరోధక శక్తిని పెంచేందుకు సహాయం చేస్తుంది. అందువల్ల ఆలుగడ్డల జ్యూస్‌ను సేవిస్తుంటే ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. రోగాల నుంచి త్వరగా కోలుకుంటారు. ఆలుగడ్డలు సహజంగానే ఆల్కలైన్ స్వభావాన్ని కలిగి ఉంటాయి. అందువల్ల లివర్ పనితీరును మెరుగు పరుస్తాయి. లివర్‌లో ఉన్న వ్యర్థాలు బయటకు పోయేలా చేస్తాయి. దీంతో లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా ఫ్యాటీ లివర్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. లివర్‌లో ఉండే కొవ్వు కరిగి ఆరోగ్యంగా ఉంటారు.

**హైబీపీ తగ్గేందుకు..**

ఆలుగడ్డల జ్యూస్‌లో పొటాషియం సైతం అధికంగానే ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. బీపీ తగ్గేలా చేస్తుంది. హైబీపీ ఉన్నవారికి ఈ జ్యూస్ ఎంతో మేలు చేస్తుంది. రోజూ తాగితే బీపీని అదుపులో ఉంచుకోవచ్చు. దీంతో గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఆలుగడ్డల జ్యూస్‌ను నేరుగా ముఖానికి రాసుకోవచ్చు. దీంతో ముఖం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది. ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు పోతాయి. ఆలుగడ్డల జ్యూస్‌ను జుట్టుకు రాసుకుంటే శిరోజాలు ఒత్తుగా దృఢంగా పెరుగుతాయి. జుట్టు రాలడం తగ్గిపోతుంది. చుండ్రు నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా ఆలుగడ్డల జ్యూస్‌తో అనేక లాభాలను పొందవచ్చు.



మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

# బోనాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయంలో ప్రధాన భాగం

**హైదరాబాద్ :** బోనాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయంలో ప్రధాన భాగం అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై జై జవాన్ జై కిసాన్ జై కళాకార్ సంస్థ నిర్వహణలో గురు పూర్ణిమ మహోత్సవంతో పాటు బోనాలు సంబరాలు పాటలు నృత్యాలతో సందడి సందడిగా జరిపారు. నాట్య గురువులు దాసరి కృష్ణ ప్రియ, టి.స్వాతి, గోపి కృష్ణ నాయుడు, సుధా కామేశ్వరి, ఛాయా చంద్రిక, జయ లక్ష్మీ శైలజ తదితరుల శిష్య బృందం వంద మందికిపైగా తమ శాస్త్రీయ జానపద నృత్యాలతో వేదికను వూపేశారు. సంగీత గురువులు శ్రీవిద్య భాస్కరభట్ల, నవ్య, హనుమంత్ ప్రసాద్, సుధా కమల, నాగజ్యోతి, భువనేశ్వరి తదితరులు శిష్య బృందం వాగ్గేయ కారులు కీర్తనలతో పాటు బోనాలు జానపద గీతాలు పాడి శ్రోతలను హుషార్ చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కోలేటి దామోదర్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ సంప్రదాయ కళలను ముందుకు తీసుకువెళ్ల వలసింది నేటి తరం వారే అన్నారు గురువులను గౌరవించటం తల్లి తండ్రులు తమ పిల్లలకు నేర్పాలని చెప్పారు. ప్రొఫెసర్ శోభా దేశపాండే, ప్రొఫెసర్ కాంత కుమారి, చకిలం సుధాకర్, జయ తీర్థ, లక్ష్మికిరణ్ తదితరులు పాల్గొనగా అధ్యక్షత వహించిన భారత్ వరల్డ్ రికార్డ్స్ స్థాపకుడు రమణారావు పాల్గొన్న కళాకారులకు ప్రశంస పత్రలు జ్ఞాపికలు బహుకరించారు. భారత్ ఆర్ట్స్




అకాడెమీ అధ్యక్షురాలు లయన్ లలితారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డాన్స్ టీచర్లు, జయలక్ష్మి శ్రీనివాస్, పగిడి మర్రి శ్రీలజ, దాసరి కృష్ణప్రియ, శ్వేత గైక్వాడ్, టి.స్వాతి, పట్టపు గోపికృష్ణ నాయుడు, సుధా కామేశ్వరి వేమూరి, ఎన్.ఛాయాచంద్రిక, మ్యూజిక్ టీచర్లు, శ్రీవిద్య భాస్కరబట్ల, భాస్కరభట్ల హనుమంత్ ప్రసాద్, సుధాకర్ కమల తాడూరి, కే.సెల్ భువనేశ్వరి, కావూరి నాగజ్యోతి, కొండపల్లి నవ్య, చీఫ్ గెస్ట్ కోలేటి దామోదర్ గుప్తా, హార్మని గెస్ట్ అడ్లూరి కాంతకుమారి, చక్కిళం సుధాకర్, శోభ దేశపాండే, స్పెషల్ ఇన్వైట్స్ లక్ష్మీ కిరణ్, జయతీర్థ తదితరులు పాల్గొన్నారు.

# మార్కండేయనగర్ పోచమ్మ తల్లి దేవాలయ కమిటీ అధ్యక్షునిగా శిరందాసు నరేందర్

**రాజేంద్రనగర్ :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్దేవుపల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్ పోచమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి శక్తివంఛన లేకుండా కృషి చేయడం జరుగుతుందని కమిటీ నూతన అధ్యక్షుడు శిరందాసు నరేందర్ తెలిపారు. ఆదివారం ఆయన కమిటీ అధ్యక్షునిగా నియమితులు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కాలనీ ప్రజలను అందరినీ కలుపుకొని పని చేయడం జరుగుతుందన్నారు. అమ్మవారి ఆలయంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తన వంతుగా చర్యలు తీసుకుంటానన్నారు. కనీస మౌలిక సదుపాయలను కల్పించేలా చొరవ చూపుతానని వెల్లడించారు. శ్రీ పోచమ్మ దేవాలయ కమిటీ ముఖ్య సలహాదారులుగా ఏర్వ సత్యనారాయణ, గద్దె కృష్ణ, పగడి మర్రి సూర్యనారాయణ, వీడెం రమేష్, పగిడిమర్రి వాసు, మునగపాటి విష్ణు, గద్దె యాదగిరి, కోట జగదీష్, వర్కల చందు, అధ్యక్షుడిగా శిరందాస్ నరేందర్, ఉపాధ్యక్షులుగా మామిడి శెట్టి శ్రీనివాస్, యాదగిరి భాస్కర్, భూసం భానుచందర్, ప్రధాన కార్యదర్శి కోట పవన్, సహాయ కార్యదర్శి ఉడుత సురేష్, గుత్తి మల్లేష్, కోశధికారి కోట శ్యామ్, కార్యవర్గ సభ్యులు కైరం కొండ శంకర్, శిరందాసు



ప్రభాకర్, అరుణ్ రెడ్డి, ఏర్వ మహేష్, ఆర్ నవీన్, బోనకుర్తి రాము, విజయ్ యాదవ్, శశిరాజ్, ముసం నరేష్, రాజు తదితరులను ఎన్నుకున్నారు.

# ప్రజలకు పోచమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలి

**చేవెళ్ల :** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని చంద్రారెడ్డి నగర్ కాలనీ సాయి కృష్ణ కాలనీ టీచర్స్ కాలనీ లలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి శాలువాతో సన్మానించారు. బోనాల సందర్భంగా మహిళలు బోనాలతో సందడి చేశారు. బోనాల ఊరేగింపుతో అమ్మవారి ఆలయాన్ని చేరుకొని మొక్కులు చెల్లించుకుని నైవేద్యాన్ని సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కాలనీలలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం చేవెళ్ల మండలం ఈర్ల పల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ గ్రామ దేవత పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ..అమ్మవారి ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. అమ్మవారి దీవెన, ప్రజల సహకారంతో 15 ఏళ్ల నుంచి ఎమ్మెల్యేగా సేవలందిస్తున్నానన్నారు. ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాలు అంటేనే ఎంతో సందడి



ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, వివిధ గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే కాలే యాదయ్య

**షాబాద్ :** షాబాద్ మండల కేంద్రంలోని పి ఆర్ ఆర్ ఎం స్టేడియంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఎస్ పి ఎల్ సీజన్ 3 విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే.శివసేన రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలగంటి మధుసూదన్ రెడ్డి, మల్లికార్జున అప్పాజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యువకులు చెడు అలవాట్లకు లోను కాకుండా ఉండాలంటే క్రీడలతోనే సాధ్యపడుతుందని తెలిపారు. విద్యార్థి దశ నుండే యువకులు క్రీడలలో పాల్గొనాలని, క్రీడలతోనే మానసిక,శారీరక శక్తి పెరిగి దృఢంగా అవుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల కొరకు ప్రత్యేక పాలసీని తీసుకొచ్చిందని తెలిపారు. ఆగస్టు నెలలో సీఎం కప్పు ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్రీడల కోసం రాష్ట్ర ప్రభుత్వం 850 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి 2.5 కోట్ల నుండి 3 కోట్ల వరకు నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో నుండి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం విజేతగా నిలిచిన కేకేఆర్ జట్టుకు ట్రోఫీతోపాటు, లక్ష రూపాయల నగదు బహుమతిని అందజేశారు. రన్నర్ అప్ గా ఢిల్లీ జట్టు నిలిచింది. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి షాబాద్ దర్శన్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి





చంద్రశేఖర్, సర్దార్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పెంటారెడ్డి, మాజీ ఎంపిటిసిలు గుండాల అశోక్, కుమ్మరి చెన్నయ్య, నాయకులు తమ్మలి రవీందర్, దండు రాహుల్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## కాక్‌టెయిల్స్ కలెక్షన్‌ను విడుదల చేసిన టైటాన్

**హైదరాబాద్ :** తమ కీలక పంపిణీదారు కమల్ వాచ్ కంపెనీతో కలసి కాక్‌టెయిల్స్ కలెక్షన్ వాచ్‌లను తాజ్ డెక్కన్ హెూటల్లో టైటాన్ రాగ విడుదల చేసింది. నేటి మహిళలు తమదైన ముద్ర వేయడానికి ప్రత్యేకంగా రూపొందించిన స్టేట్‌మెంట్ వాచ్‌ల ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఫ్యాషన్, సోదరభావాన్ని మిళితం చేసిన ప్రత్యేక కార్యక్రమాల ద్వారా థీమ్‌కు ఇన్‌ఫ్లుయెన్సర్లు లక్ష్మీ రెడ్డి, తహెరా ప్రాణం పోశారు. స్టిర్ అప్ ద నైట్ ఇన్ స్టైల్ అంటూ అతిథులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టైటాన్ రాగ, మల్టీ బ్రాండ్ రిటైల్ నేషనల్ సేల్స్ హెడ్ రాహుల్ పాండే, హైదరాబాద్‌లో రాగ కీలక పంపిణీ భాగస్వామి అయిన కమల్ వాచ్ కంపెనీ డైరెక్టర్ రాజేందర్ తోట్ల పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**చేవెళ్ల :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు పనిచేయాలని చేవెళ్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తీక్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ప్రజా జ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ యువతను రాజకీయంగా ప్రోత్సహిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. రుణమాఫీ,రైతులకు



రైతు భరోసా, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని గుర్తు చేశారు. చేవెళ్ల మండలంలోని ప్రతి గ్రామంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను ఎన్నుకుంటామని కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల యువతకు ప్రాధాన్యత ఇస్తామని, ఈ అవకాశాన్ని గ్రామీణ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం :** మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ, మంకాళ, ఇమామ్గూడ తదితర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించబడిన మహంకాళి అమ్మవారి బోనాల జాతరల్లో మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. భక్తులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్థానికులతో మమేకమై సంబరాల్లో పాల్గొన్న ఆమె, తెలంగాణ సాంస్కృతిక విలువలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు.

## తీన్మార్ మల్లన్నపై అగ్రవర్ణాల కుట్ర


**హైదరాబాద్ :** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై అగ్రవర్ణాలు, జాగృతి నాయకులు, ఎమ్మెల్సీ కవిత అనుచరులు కుట్ర పూర్వకంగానే దాడి చేశారని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. తీన్మార్ మల్లన్నపై దాడిని అజయ్ కుమార్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. తీన్మార్ మల్లన్నకు బీసీ సమాజం అండగా నిలబడుతుందన్నారు. తీన్మార్ మల్లన్నపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం



వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్నకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. రాష్ట్రంలో బీసీ నాయకులపై దాడులు చేస్తే అగ్రవర్ణ పార్టీలకు రాబోయే రోజుల్లో కనుమరుగైపోతాయని అన్నారు

## భూభారతితో రైతుల కష్టాలు తీరేనా!?

**నారాయణపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులు సమస్యలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నెరవేరుతాయని భూ భారతి కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శ్రీకారం చుట్టారు. నారాయణ పేట జిల్లా




మద్దూర్ మండలంలో భూ భారతిలో రెవెన్యూ సమస్యలు పరిష్కారం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో చాలామంది రైతులు తాము పడుతున్న ఇబ్బందుల గురించి భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో భారీ ఎత్తున్న దరఖాస్తులు చేసుకున్నారు. మద్దూర్ మండలాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి గత నెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సదస్సులకు జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్ ఆధ్వర్యంలో వివిధ రెవెన్యూ గ్రామాల నుంచి మొత్తం 1341 దరఖాస్తులను దాఖలు చేసుకున్నారు. భూ సమస్యలను పరిష్కారిస్తామని ధరణి స్థానంలో భూ భారతిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. మద్దూర్ మండలంలో మొత్తం 1341 దరఖాస్తుల్లో కొంతమందికి ఫోన్‌ల ద్వారా సమాచారం ఇచ్చి నేరుగా రెవెన్యూ అధికారులు వారివారి ల్యాండ్‌లోకి వెళ్లి ఎంక్వయిరీ చేశారు. ఇంకా చాలామంది రైతులకు ఫోన్ సమాచారం రాలేదని చాలామంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం 475 దరఖాస్తులకు మాత్రమే పరిష్కరించినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. భూ భారతి కింద మొదట పైలెట్ ప్రాజెక్ట్ కింద 3 మండలాలు ఎంపిక చేశారు. వాటిలో మద్దూర్ మండలంలో 1341 దరఖాస్తులు స్వీకరించారు. వీటికి సంబంధించి జూన్ 2వ తేదీన ప్రొసీడింగ్ అర్డర్‌లు ఇస్తామని రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులు సదస్సులో రైతులకు హామీలిచ్చారు. కొందరికి మాత్రమే ఇచ్చారు. ఇంకా రైతులకు సదస్సులు జరిగి నెల రోజులు అవుతున్నా వీటికి మోక్షం లభించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి రైతులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. 1345 దరఖాస్తులో అధికారులు పరిశీలన చేసి 475 మంది రైతుల భూ సమస్యలు తీర్చడం జరిగిందని ఎమ్మార్వో తెలిపారు. మిగతా 866 మంది రైతుల దరఖాస్తులు అండర్ ప్రాసెస్లో ఉన్నాయి అన్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు తాసిల్దార్ కార్యాలయం నుంచి ఆర్డిఓ కలెక్టర్ ఆఫీస్ కు పంపించడం జరిగిందని తెలిపారు. రైతుల దరఖాస్తులో చాలామంది రైతులవి ఆర్డీఓ పెండింగ్ మరియు అడిషనల్ కలెక్టర్ పెండింగ్ అని ఆన్లైన్లో చూయిస్తుంది. జిల్లా అధికారులు నెలలు గడుస్తున్న రైతుల సమస్యలు తీర్చడం లేదని మద్దూరు మండల రైతులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.

## బిజినెస్ వాయిస్

## ట్రెండింగ్ పేజీని మూసివేయనున్న యూట్యూబ్..!




ప్రముఖ వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ ట్రెండింగ్ పేజీని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ట్రెండింగ్ పేజీని 2015లో ప్రారంభించగా.. వైరల్ వీడియోలు, బ్రేకింగ్ న్యూస్, టాప్ మ్యూజిక్ రిలీజ్‌లను హైలైట్ చేసేందుకు అవకాశం ఉండేది. దాదాపు దశాబ్దకాలం పాటు యూజర్లకు ట్రెండింగ్ కంటెంట్‌ను అందించిన ఈ ఫీచర్‌ను ఈ ఏడాది జులై 21 నుంచి వీడ్కోలు పలుకనున్నది. వినియోగదారుల వ్యూయింగ్ హ్యాబిట్స్‌లో వచ్చిన మార్పులతో పాటు ప్లాట్‌ఫామ్ అభివృద్ధికి అనుగుణంగా మూసివేయాలని నిర్ణయించినట్లు యూట్యూబ్ పేర్కొంది. యూట్యూబ్ ట్రెండింగ్ పేజీ గతంలో యూజర్లకు ప్లాట్‌ఫామ్‌లో పాపులర్ కంటెంట్‌ను తెలుసుకునేందుకు ఓ మెయిన్ డెస్టినేషన్‌గా ఉన్నది. ఈ పేజీలో వీడియోలు అన్ని వర్గాల నుంచి, ముఖ్యంగా హై క్లిక్ రేట్‌తో ఉన్నవి కనిపించేవి. గత కొంతకాలంగా యూజర్ల అలవాట్లు మారుతూ వస్తున్నాయి. యూట్యూబ్ అధునాతన రికమెండేషన్ అల్గారిథమ్‌లు హోమ్‌పేజీల ద్వారా ట్రెండింగ్ కంటెంట్‌ను నేరుగా అందిస్తుండడంతో ట్రెండింగ్ పేజీకి ఆదరణ తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం యూజర్లు షార్ట్స్, కమ్యూనిటీ పోస్ట్‌లు, సెర్చ్ సజెషన్స్ ద్వారా ట్రెండ్స్‌ను ఫాలో అవుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రెండింగ్ పేజీ స్థానంలో, యూట్యూబ్ చార్ట్స్, కస్టమైజ్ చేసిన రికమెండేషన్‌లపై యూట్యూబ దృష్టి పెట్టనున్నది. ఈ చార్ట్స్ విభాగాల వారీగా ట్రెండింగ్ కంటెంట్‌ను అందించనుండగా.. యూజర్లకు మరింత నిర్దిష్టమైన కంటెంట్ డిస్కవరీ అనుభవాన్ని అందించనున్నది. అదనంగా, క్రియేటర్‌లకు సహాయం చేసేందుకు యూట్యూబ్ స్టూడియోలోని ఇన్‌స్పిరేషన్ ట్యాబ్ తదితర ఫీచర్స్‌ను కొనసాగించనున్నది. ఇవి కొత్త ట్రెండ్‌లను గుర్తించడంలో సహాయపడనున్నాయి. కొత్త కంటెంట్ క్రియేటర్లను ప్రోత్సహించేందుకు 'హైప్' ఫీచర్ తదితర కొత్త టూల్స్‌ను యూట్యూబ్ పరిచయం చేయనున్నది.

### లైనప్ నుంచి పల్సర్ ఎన్-150ని తొలగిస్తున్న బజాజ్

ప్రముఖ ద్విచక్ర వాహనాల కంపెనీ బజాజ్ కంపెనీ తన లైనప్ నుంచి పల్సర్ ఎన్ 150ని తొలగించాలని నిర్ణయించింది. ఈ బైక్ ఇప్పుడు కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా కనిపించడం లేదు. దీన్ని బట్టి ఈ మోడల్‌ను తొలగించినట్లు స్పష్టంగా తెలుస్తున్నది. పల్సర్ ఎన్150 సెప్టెంబర్ 2023లో కంపెనీ లాంచ్ చేసింది. ఈ మోడల్‌ను ఇంత తక్కువ సమయంలో నిలిపివేయడాన్ని బట్టి అమ్మకాలు అంతబాగా లేవని సూచిస్తుందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. సమాచారం మేరకు.. ఈ ఏడాది మేలో పల్సర్ క్లాసిక్, ఎన్ 150 బైక్స్ 15,937 యూనిట్లు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే సమయంలో 29,386 యూనిట్లు విక్రయమయ్యాయి. అలాంటి పరిస్థితిలో పేలవమైన అమ్మకాల నేపథ్యంలో కంపెనీ పల్సర్ ఎన్150ని అమ్మకాలను నిలిపివేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. రాబోయే రోజుల్లో కంపెనీ పల్సర్ 150 క్లాసిక్ అమ్మకాలను నిలిపివేయవచ్చనే ప్రచారం జరుగుతున్నది. కంపెనీ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇక ఇంజిన్ గురించి మాట్లాడుకుంటే బజాజ్ పల్సర్ %చీ%150లో 149.68సీసీ సింగిల్ సిలిండర్ ఎయిర్ కూల్డ్ ఇంజిన్‌తో వస్తుంది. ఇది 14.3 బీహెచ్‌పీ పవర్, 13.5 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇంజిన్ 5 స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తుంది. దాంతో ఏ వాతావరణంలోనైనా ఇంజిన్ సమర్థవంతంగా పని చేస్తుంది. రైడర్ భద్రత కోసం, ఈ బైక్‌లో సింగిల్ ఛానల్ యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ ఇచ్చారు. ఫ్రంట్‌లో డిస్క్ బ్రేక్, రియర్‌లో భాగంలో డ్రమ్ బ్రేక్స్ ఉంటాయి.

# విద్యా రుణాలకు అమెరికా కోత



ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులు తీసుకునే రుణాల్లో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల(ఎన్‌బీఎఫ్‌సీల) వాటా కూడా ఎక్కువగానే ఉంటోంది. క్రెడిలా, ఆక్జిలో, ఇంక్రెడ్, అవాన్సే ఫైనాన్షియల్ సర్వీసెస్ తదితర సంస్థలు ప్రధానంగా ఈ విభాగంలో రాణిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో మాత్రం ఎన్‌బీఎఫ్‌సీల విద్యా రుణాల వృద్ధి తగ్గే అవకాశం ఉందని రేటింగ్స్, పరిశోధనా సంస్థ క్రిసిల్ తెలిపింది. అమెరికా వీసా విధానాల్లో గణనీయ మార్పులు ఇందుకు కారణంగా తెలిపింది. ఈ ఆంక్షల వల్ల ఆ దేశంలో విద్యను అభ్యసించేందుకు రుణాలు తీసుకోవడం తగ్గే అవకాశం ఉందని విశ్లేషించింది. అమెరికాలో విధానపరమైన అనిశ్చితులతో పాటు వీసాల మంజూరును తగ్గించడం, ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణా నిబంధనలను తొలగించాలనే ప్రతిపాదన వల్ల కొత్త రుణాలపై ప్రభావం పడిందని వివరించింది. దీనివల్ల గత ఆర్థిక సంవత్సరం అమెరికాలో విద్యను అభ్యసించేందుకు మొత్తం రుణాల మంజూరు 30 శాతం మేర తగ్గిందని తెలిపింది.

**కెనడాలోనూ ఇదే పరిస్థితి**

విద్యా రుణాలకు రెండో అతిపెద్ద విపణి అయిన కెనడాలోనూ ఇదే పరిస్థితి నెలకొందని క్రిసిల్ తెలిపింది. విద్యార్థి వీసా నిబంధనలను కఠినతరం చేయడంతో ఆ దేశానికి సంబంధించి విద్యా రుణాల మంజూరు తగ్గిందని తెలిపింది. దీంతో 2024-25లో మొత్తంగా విద్యా రుణాల మంజూరు కేవలం 8 శాతమే పెరగగా.. 2023-24లో ఈ వృద్ధి 50 శాతంగా ఉండటం గమనార్హం.

**ప్రత్యామ్నాయాలపై దృష్టి**

అమెరికా, కెనడా విపణుల్లో విద్యా రుణాలకు ప్రతికూల పరిస్థితులు ఉంటుండటంతో.. కొత్త విపణులపై ఎన్‌బీఎఫ్‌సీలు దృష్టి సారిస్తున్నాయి. విద్యార్థులూ ప్రత్యామ్నాయ దేశాలను ఎంపిక చేసుకుంటుండటంతో బ్రిటన్, జర్మనీ, ఐర్లాండ్‌లో విద్యా కోర్సులను అభ్యసించేందుకు రుణాల మంజూరు గత ఆర్థిక సంవత్సరం రెట్టింపు అయ్యింది. 2024-25లో ఈ తరహా దేశాలకు సంబంధించి మొత్తం విద్యా రుణాల మంజూరులో సుమారు 50 శాతం వృద్ధి ఉంది. 2023-24లో ఇది 25 శాతమే. అయితే అమెరికా నుంచి తగ్గే విద్యా రుణాల ప్రభావాన్ని ఈ దేశాలు పూర్తిగా తగ్గించలేవు. 2025 మార్చి 31 నాటికి మొత్తం విద్యా రుణాల్లో అమెరికా వాటా 50 శాతంగా ఉంది. 2024 మార్చి 31 నాటి 53 శాతంతో పోలిస్తే తగ్గింది. వచ్చే కొన్నేళ్లలో అమెరికా వాటా మరింతగా తగ్గే అవకాశం ఉంది. కొత్త విపణులకు రుణ సంస్థలు ప్రాధాన్యాన్ని పెంచుతుండటమే ఇందుకు కారణం.

**ఏయూఎంలో వృద్ధి తగ్గొచ్చు..**

భారత్‌లో గత కొన్నేళ్లుగా విద్యా రుణాల విభాగంలో 50 శాతానికి మించి వృద్ధి నమోదవుతోందని క్రిసిల్ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో విద్యా రుణాలకు సంబంధించి ఎన్‌బీఎఫ్‌సీల నిర్వహణలోని ఆస్తుల విలువ(ఏయూఎం) 48% పెరిగి రూ.64,000 కోట్లకు చేరింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ విలువ 25 శాతమే పెరిగి రూ.80,000 కోట్లకు చేరొచ్చని క్రిసిల్ విశ్లేషించింది.

# ఈ క్రెడిట్ కార్డు.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదు



ఈరోజుల్లో దాదాపు ప్రతిఒక్కరి దగ్గర ముఖ్యంగా ముఖ్యంగా వర్కింగ్ ప్రొఫెషనల్స్ అందరి దగ్గరా క్రెడిట్ కార్డులు ఉన్నాయి. కొందరి దగ్గరైతే రెండు, మూడుకు మించి కూడా క్రెడిట్ కార్డులు ఉంటున్నాయి. క్రెడిట్ సదుపాయంతోపాటు ఆకర్షణీయమైన ప్రయోజనాల కోసం చాలా మంది క్రెడిట్ కార్డులను వినియోగిస్తుంటారు. అయితే ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రెడిట్ కార్డు గురించి తెలుసా? దీని కోసం ఎంత ఖర్చవుతుందో తెలిస్తే నోరెళ్లబెడతారు.. నేటి ప్రపంచంలో క్రెడిట్ కార్డులు రోజువారీ జీవితంలో భాగంగా మారాయి. చాలా మంది ఒకటి కంటే ఎక్కువ క్రెడిట్ కార్డులను కలిగి ఉంటారు. అసరమైనప్పుడు ఖర్చు చేసేందుకు మాత్రమే కాకుండా సినిమా టిక్కెట్లపై డిస్కౌంట్లు, రివార్డ్ పాయింట్లుక,ఉచిత ఎయిర్ పోర్ట్ లాంజ్ యాక్సెస్ వంటి ప్రయోజనాలను కూడా క్రెడిట్ కార్డులు. ఈ ప్రయోజనాలు పరోక్షంగా డబ్బు ఆదా చేయడానికి సహాయపడతాయి. అయితే క్రెడిట్ కార్డులను జాగ్రత్తగా ఉపయోగించకపోతే మాత్రం ఆర్థిక ఒత్తిడికి దారితీస్తుంది.

**భారత్‌లో 200 మంది దగ్గరే..**

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రెడిట్ కార్డు ఒకటి ఉంది. దీని పేరు అమెరికన్ ఎక్స్ ప్రెస్ సెంచూరియన్ కార్డ్. సింపుల్‌గా అమెక్స్ బ్లాక్ కార్డ్ అని పిలుస్తారు. దీనిని అమెరికన్ ఎక్స్ ప్రెస్ బ్యాంక్ జారీ చేస్తుంది.ఈ కార్డు ఖరీదైనది మాత్రమే కాదు. చాలా ప్రత్యేకమైనది కూడా. ఇది అందరికీ అందుబాటులో ఉండదు. సాధారణ కార్డుల మాదిరిగా దీనికి దరఖాస్తు చేయలేము. నివేదికల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా కేవలం లక్ష మందికి మాత్రమే ఈ కార్డు ఉంది. భారత్ లో అయితే కేవలం 200 మంది దగ్గర మాత్రమే ఈ కార్డు ఉందని చెబుతున్నారు. ఇది 2013లో భారత మార్కెట్లోకి ప్రవేశించింది.

**రూ.10 కోట్లు ఖర్చు చేసే సామర్థ్యం ఉండాలి**

అమెక్స్ బ్లాక్ కార్డు ఆహ్వానం ద్వారా మాత్రమే ఇస్తారు. అది కూడా చాలా అధిక ఆదాయం, ఖర్చు అలవాట్లు ఉన్నవారికి. అర్హత సాధించాలంటే రూ.10 కోట్ల వరకు ఖర్చు చేసే సామర్థ్యం ఉండాలి. దీన్నిబట్టి ఈ కార్డు కేవలం ధనవంతుల కోసమేనని స్పష్టమవుతోంది. అమెరికన్ ఎక్స్ ప్రెస్ సెంచూరియన్ కార్డ్‌తో ప్రపంచ స్థాయి హోటళ్లలో బస, ప్రైవేట్ జెట్ సేవలు, ఎయిర్‌పోర్ట్‌లలో వీఐపీ ట్రీట్‌మెంట్ వంటి అల్ట్రా లగ్జరీ సదుపాయాలు లభిస్తాయి.

**రూ.లక్షల్లో కార్డు ఫీజు**

అమెక్స్ బ్లాక్ కార్డు ఖరీదు మామూలుగా ఉండదు. భారత్‌లో ఈ కార్డ్ ఇనీషియేషన్ ఫీజు రూ.7 లక్షలు, జాయినింగ్ ఫీజు రూ.2.75 లక్షలు ఉంటుంది. వీటికి జీఎస్టీ అదనం. అంటే ఈ క్రెడిట్ కార్డుకు మొదటి ఏడాది చెల్లించాల్సి మొత్తం రూ.11.5 లక్షలు దాటుతుంది. ఇక వార్షిక రుసుము రూ.2.75 లక్షలు జీఎస్టీతో కలుపుకొంటే రూ.3,24,500 అవుతుంది.

# నిప్పులు చెరిగిన పేసర్లు.. స్వల్ప స్కోర్‌కే ఆలౌటైన ఆస్ట్రేలియా



జమైకా వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న పింక్ బాల్ టెస్ట్‌లో ఆతిథ్య వెస్టిండీస్ జట్టు తొలి రోజు పైచేయి సాధించింది. ఆ జట్టు పేసర్లు నిప్పులు చెరిగే బంతులతో ఆసీస్ ఆటగాళ్లను బెంబేలెత్తించారు. ఫలితంగా ఆసీస్ 225 పరుగులకే ఆలౌటైంది. షమార్ జోసెఫ్ 4, జేడన్ సీల్స్, జస్టిన్ గ్రీవ్స్ తలో 3 వికెట్లు తీసి ఆసీస్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. ఆసీస్ ఇన్నింగ్స్ ఆదిలో సజావుగానే సాగింది. 28 పరుగులకే తొలి వికెట్ (కొన్‌స్టాస్ (17), 68 పరుగులకే రెండో వికెట్ (ఖ్వాజా (23)) కోల్పోయినా.. గ్రీన్ (46), స్మిత్ (48) ఆసీస్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అయితే గ్రీన్ ఔటైన తర్వాత ఆసీస్ 68 పరుగుల వ్యవధిలో చివరి 7 వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్ బ్యాటర్లు, టెయిలెండర్లు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. హెడ్ (20) ప్రతిఘటించే ప్రయత్నం చేసినా సబ్‌స్టిట్యూట్ ఆటగాడు ఆండర్సన్ ఫిలిప్ కళ్లు చెదిరే క్యాచ్‌తో అతన్ని పెవిలియన్ బాట పట్టించాడు. వెబ్‌స్టర్ 1, అలెక్స్ క్యారీ 21, కమిన్స్ 24, స్టార్క్ 0, బోలాండ్ 5 (నాటౌట్), హాజిల్‌వుడ్ 4 పరుగులు చేశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విండీస్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది. ఓపెనర్ కెవియన్ ఆండర్సన్‌ను (3) మిచెల్ స్టార్క్ క్లీన్ బౌల్డ్ చేశాడు. మరో ఓపెనర్ బ్రాండన్ కింగ్ (8), కెప్టెన్ రోస్టన్ ఛేజ్ (3) క్రీజ్‌లో ఉన్నారు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు విండీస్ ఇంకా 209 పరుగులు వెనకుపడి ఉంది. కాగా, మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను ఆసీస్ ఇదివరకే 2-0 తేడాతో గెలుచుకుంది. తొలి రెండు టెస్ట్‌ల్లో ఆసీస్ అద్భుత విజయాలు సాధించింది. నామమాత్రంగా సాగుతున్న చివరి మ్యాచ్‌లో తొలి రోజు విండీస్ పైచేయి సాధించడం విశేషం.

# సిరాజ్ అత్యుత్సాహం.. కొట్టేస్తావా ఏంటి..?

లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్ట్ నాలుగో రోజు ఆట ప్రారంభం కాగానే ఇంగ్లండ్ తొలి వికెట్ కోల్పోయింది. సిరాజ్ అద్భుతమైన బంతితో బెన్ డకెట్‌ను (12) బోల్తా కొట్టించాడు. పుల్ షాట్ ఆడే ప్రయత్నంలో డకెట్ బుమ్రాకు సునాయాసమైన క్యాచ్ అందించాడు. డకెట్‌ను ఔట్ చేశాక సిరాజ్ పట్టలేని ఆనందంలో అత్యుత్సాహాన్ని ప్రదర్శించాడు. డకెట్‌వైపు కోపంగా చూస్తూ పెవిలియన్‌వైపు అడుగులేస్తున్న అతన్ని భుజంతో ఢీకొట్టాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరలవుతుంది. సిరాజ్ ప్రవర్తనపై క్రికెట్ అభిమానులు మండిపడుతున్నారు. అంత ఓవరాక్షన్ అవసరం లేదని అక్షింతలు వేస్తున్నారు. కొట్టేస్తావా ఏంటని ప్రశ్నిస్తున్నారు. కాగా, ఈ మ్యాచ్‌లో సిరాజ్ మూడో రోజు చివర్లో కూడా ఇదే తరహా ప్రదర్శనతో నెటిజన్లచే చివాట్లు తిన్నాడు. మూడో రోజు ఆట ముగియడానికి ఆరు నిమిషాలు ఉండగా.. ఇంగ్లండ్ తమ సెకెండ్ ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. ఈ సమయంలో భారత్ కనీసం రెండు ఓవర్లు అయినా బౌలింగ్ చేయాలని తహతహలాడింది. కానీ ఇంగ్లండ్ ఓపెనర్లు మాత్రం ఒక్క ఓవర్ ఆడి మూడో రోజు ఆటను ముగించాలని భావించారు. దీంతో బుమ్రా వేసిన తొలి ఓవర్‌లో ఇంగ్లండ్ ఓపెనర్ జాక్ క్రాలీ పదేపదే అంతరాయం కలిగించి సమయాన్ని వృథా చేశాడు. ఈ క్రమంలో సహనం కోల్పోయిన గిల్.. క్రాలీని పరుష పదజాలంతో దూషించాడు. దీంతో జాక్ క్రాలీ కూడా వేలు చూపిస్తూ వాగ్వాదానికి దిగాడు. గిల్‌కు తోడుగా సిరాజ్ కూడా సీన్‌లోకి కావడంతో కాసేపు ఫీల్డ్‌లో గందరగోళం నెలకొంది. ఆ తర్వాత అంపైర్‌లు జోక్యంతో చేసుకోవడంతో గొడవ సద్దమణిగింది. గిల్, సిరాజ్ ప్రవర్తనను క్రికెట్ అభిమానులు తప్పుబడుతున్నారు. ఇంత ఓవరాక్షన్ అవసరం లేదని హితవు పలుకుతున్నారు. మ్యాచ్ విషయానికొస్తే.. నాలుగో రోజు తొలి సెషన్‌లోనే ఇంగ్లండ్ రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. రెండు వికెట్లు సిరాజే తీసుకున్నాడు. తొలుత డకెట్‌ను ఔట్ చేసిన సిరాజ్, ఆతర్వాత ఓలీ పోప్‌ను (4) వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు.

## క్రీడా వాయిస్

### వాళ్లు డబ్బున్నోళ్లు.. పెనాల్టీలను పట్టించుకోరు: గిల్, స్టోక్స్‌పై మైఖెల్ వాన్ కామెంట్స్!




**ఇంటర్నెట్‌డెస్క్:** భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఇంగ్లాండ్ సారథి బెన్ స్టోక్స్ సంపన్న క్రికెటర్లని ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు మైఖెల్ వాన్స్ అభిప్రాయపడ్డాడు. లార్డ్స్ మైదానంలో జరుగుతున్న టెస్ట్‌లో తొలి రెండ్రోజులు తక్కువ ఓవర్లు వేయడంపై అతడు అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఆయా జట్లు కచ్చితంగా 90 ఓవర్లు కచ్చితంగా వేయాల్సిందని అభిప్రాయపడ్డాడు. అయితే.. స్లో ఓవర్ రేటుకు కెప్టెన్లపై పెనాల్టీలు విధించడం పెద్దగా ప్రభావం చూపదన్నాడు. "ఫైన్లు ప్రభావం చూపిస్తాయని నేను అనుకోను. ఈ క్రికెటర్లు చాలా సంపన్నులని అనుకొంటున్నాను. నగదు వారిపై ప్రభావం చూపుతుందని అనుకోను. ఓవర్లు పూర్తిచేయకపోవడం కొన్నాళ్లుగా టెస్ట్‌మ్యాచ్‌లకు సమస్యగా మారింది. వేడి ఎక్కువగా ఉందని తెలుసు. ఆటగాళ్లు కూడా గాయాలతో బాధపడుతున్నారని తెలుసు. ఐదో రోజు మ్యాచ్‌లో 90 ఓవర్లు వేసి తీరాల్సిందే.

**ఆటను ఆస్వాదించా.. పంత్‌లా షాట్లు కొట్టాలనుంది: కేఎల్ రాహుల్**

అలాంటిది మొదటి, రెండో, మూడో, నాలుగోవ రోజు ఆట నెమ్మదిగా ఎందుకు నెమ్మదిగా సాగుతోందో నాకు అర్థం కావడంలేదు. కేవలం మ్యాచ్ చివరి రోజే కాకుండా.. ఇరు జట్లు తరువాత కూడా వేగాన్ని చూపించాలి. అప్పుడే అంపైర్లూ పరుగులు పెడతారు. డ్రింక్ బ్రేక్‌లు ఎక్కువగా ఉండవు. ఎందుకంటే 90 ఓవర్లు వేయాలని వారికి తెలుసు. ఒక్కసారి జట్లు ఫుల్ కోటా ఓవర్లు బౌలింగ్ చేయడం మొదలుపెడితే.. టెస్ట్ మ్యాచుల్లో జీవం వస్తుంది. మీరు ఒక్కసారి 90 వేయండి.. మ్యాచ్‌లు మెరుగుపడతాయని గ్యారెంటీగా చెబుతాను" అని వాన్ అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో భారత్-ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న రెండో టెస్ట్ తొలి రోజు కేవలం భారత్ కేవలం 83 ఓవర్లు మాత్రమే వేసింది. ఇక రెండో రోజులు ఇరు జట్లు కలిపి 75 ఓవర్లు వేశాయి.

# రక్తహీనత నివారణకు దానిమ్మ సరైన పరిష్కారం



దానిమ్మ.. కేవలం రుచికి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా ఒక అద్భుతమైన వరం. ప్రతి దానిమ్మ గింజలో పోషకాల నిల్వలు దాగి ఉన్నాయని, అందుకే శతాబ్దాలుగా వైద్యులు దానిమ్మ తినమని సలహా ఇస్తున్నారని మీకు తెలుసా? దానిమ్మలో యాంటీ-ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటమే కాకుండా, అనేక ముఖ్యమైన పోషకాలు మీ ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడతాయి. మీరు రోజూ ఒక దానిమ్మపండును మీ దైనందిన ఆహారంలో చేర్చుకుంటే ఎలాంటి అద్భుతమైన ప్రయోజనాలు పొందుతారో ఇప్పుడు తెలుసుకుందాం.. దానిమ్మ కేవలం ఒక పండు కాదు, అది ఒక 'సూపర్ ఫుడ్'. ఆయుర్వేదం , ఆధునిక వైద్యశాస్త్రం రెండింటిలోనూ దీనికి విశేష స్థానం ఉంది. దానిలో ఉండే పోషకాలు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలో సహాయపడతాయని నిరూపితమైంది.

**ప్రధాన ప్రయోజనాలు..?**

బరువు నియంత్రణ: తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ కలిగిన దానిమ్మ, కడుపును ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది, తద్వారా బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

మానసిక ఆరోగ్యం: జ్ఞాపకశక్తిని పెంచడంలో అల్జీమర్స్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా దానిమ్మ సహాయపడుతుంది. రోజూ దీనిని తీసుకోవడం వల్ల మెదడు ఆరోగ్యంగా ఉండి, వృద్ధాప్యంతో వచ్చే జ్ఞాపకశక్తి సమస్యల ప్రమాదం తగ్గుతుంది.

రోగనిరోధక శక్తి : దానిమ్మలో విటమిన్-సి, యాంటీ-ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి, తద్వారా జలుబు, ఇన్ఫెక్షన్లు, ఇతర వ్యాధులతో పోరాడే సామర్థ్యం పెరుగుతుంది.

రక్తహీనత నివారణ : ఐరన్‌కు మంచి వనరు అయిన దానిమ్మ, శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. రక్తహీనతతో బాధపడేవారికి ఇది ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. అంతేకాకుండా, ఇది రక్త ప్రసరణను కూడా మెరుగుపరుస్తుంది.

మెరుగైన జీర్ణక్రియ : దానిమ్మలో అధిక ఫైబర్ కంటెంట్ ఉంటుంది, ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్ధకం, గ్యాస్, ఆమ్లత్వం వంటి సాధారణ సమస్యల నుండి ఇది ఉపశమనం కలిగిస్తుంది.

చర్మం, జుట్టు సంరక్షణ: దానిమ్మలోని యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని మెరిసేలా చేసి, ముడతలను తగ్గిస్తాయి. అలాగే, ఇది జుట్టును బలోపేతం చేసి, జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.

# మాంసంతో కలిపి తినకూడని ఫుడ్స్!



నాన్ వెజ్ ని రుచి కోసం ఇష్టపడినా.. దానికి తగ్గట్టు సరైన ఫుడ్ కాంబినేషన్స్ ఫాలో అవ్వకపోతే డైజేషన్ ప్రాబ్లమ్స్, ఎలర్జీలు లాంటి హెల్త్ ఇష్యూస్ వచ్చే రిస్క్ ఉంది. ముఖ్యంగా కొన్ని ఫుడ్ ఐటమ్స్ ని మాంసంతో కలిపి తినడం ఆరోగ్యానికి హానికరం. మాంసాహారాన్ని రుచి కోసం ఎంతోమంది ఇష్టపడతారు. అయితే మాంసం తినేటప్పుడు ఇతర ఆహార పదార్థాలు జోడించడం వల్ల జీర్ణ సమస్యలు, అలర్జీలు లాంటి ఆరోగ్య ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. అటువంటి వాటిలో కొన్ని ముఖ్యమైన ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

పాల ఉత్పత్తులు: మాంసం తిన్న తర్వాత పాలు, పెరుగు, మజ్జిగ లాంటి పాల ఆధారిత ఆహారాలు తీసుకోవడం వల్ల శరీరంలో జీర్ణ ప్రక్రియ మందగిస్తుంది. పాలు చల్లని స్వభావం కలిగి ఉంటాయి. ఇవి మాంసంలోని ప్రొటీన్లతో కలిసి అజీర్ణానికి దారితీస్తాయి. ముఖ్యంగా చేపలతో పాలు కలిపి తినడం వల్ల ఫుడ్ అలర్జీలు, తిమ్మిరి, చర్మ సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది.

ఆకుకూరలు: ఆకుకూరలు పోషక విలువలతో నిండినవే అయినా.. మాంసంతో కలిపి తినడం కొన్ని సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా కొన్ని ఆకుకూరల్లో ఉండే ఆక్సాలిక్ ఆసిడ్.. మాంసంలోని కాల్షియంతో కలిసిపోయి శరీరానికి ఆ పోషకాలు అందకుండా చేస్తుంది. ఇది పోషక లోపాలకు దారితీస్తుంది. ఆయుర్వేదం ప్రకారం కూడా ఈ రెండు వేర్వేరు రకాల ఆహారాలు. కాబట్టి సమయం తేడాతో తినాలి.

సిట్రస్ పండ్లు: నిమ్మకాయ, నారింజ, ద్రాక్ష లాంటి పుల్లని పండ్లను మాంసాహారంతో కలిపి తినడం వల్ల గ్యాస్, మంట, ఉబ్బరం లాంటి జీర్ణ సంబంధిత ఇబ్బందులు తలెత్తవచ్చు. వీటిలో ఉండే ఆమ్లాలు, మాంసంలో ఉండే ప్రొటీన్లను సరిగా జీర్ణం కాకుండా చేస్తాయి. మాంసం తిన్న తరువాత ఈ రకమైన పండ్లు తినడం వల్ల అజీర్ణ సమస్యలు ఎదురవుతాయి. తేనె: తేనెను మాంసంతో కలిపి తినడం వల్ల శరీరంలో వేడి పెరుగుతుంది. మాంసం కూడా సహజంగానే శరీరాన్ని వేడి చేస్తుంది కాబట్టి.. ఈ రెండింటి కలయికతో జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అంతేకాకుండా ఆయుర్వేదం ప్రకారం.. ఈ విధంగా కలిపి తినడం విష ప్రభావానికి దారితీస్తుందని చెప్పబడింది.

టీ, కాఫీ: మాంసం తిన్న వెంటనే టీ లేదా కాఫీ తాగడం చాలా మందికి అలవాటు. కానీ ఈ డ్రింక్స్ లలో ఉండే టానిన్, కెఫైన్ లాంటి పదార్థాలు మాంసంలో ఉన్న ఐరన్ ను శరీరం గ్రహించకుండా అడ్డుకుంటాయి. దీని వలన పోషక లోపాలు ఏర్పడే అవకాశముంటుంది. కాబట్టి మాంసాహారానికి ముందు లేదా కనీసం 2 గంటల విరామం తర్వాత ఈ డ్రింక్స్ తీసుకోవడం మంచిది. మాంసాన్ని ఎక్కువ నూనె, ఉప్పుతో వండడం వల్ల జీర్ణ వ్యవస్థపై అధిక భారం పడుతుంది. ఇది అజీర్ణం, ఆమ్లత్వం, మలబద్ధకం లాంటి సమస్యలకు దారితీస్తుంది. సుగంధ ద్రవ్యాలు కూడా పరిమితంగా వాడటం ఉత్తమం.

# మల్లె పువ్వుల టీ తాగితే ఎన్నో అద్భుతమైన లాభాలు!



మల్లె పువ్వులను సాధారణంగా మహిళలు తమ జుట్టులో ధరిస్తుంటారు. అలాగే శుభ కార్యాల్లో, దైవ పూజ కోసం కూడా వినియోగిస్తారు. మల్లె పువ్వుల్లో చాలా రకాలు ఉంటాయి. అయితే బొండు మల్లె పువ్వులతో చేసిన టీ పొడి మనకు మార్కెట్‌లో లభిస్తుంది. దీన్ని మనం హెర్బల్ టీగా సేవించవచ్చు. ఈ క్రమంలోనే మల్లె పువ్వుల టీ తయారు చేసి తాగితే అనేక లాభాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పలు వ్యాధులకు ఈ టీ ఔషధంగా పనిచేస్తుందని, అలాగే అనేక పోషకాలను కూడా అందిస్తుందని అంటున్నారు. మల్లె పువ్వుల టీలో పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఎల్-థియానైన్ అనే సమ్మేళనం కూడా అధికంగా ఉంటుంది. అందువల్ల ఇవి మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మల్లె పువ్వుల టీని రోజుకు ఒకటి లేదా రెండు కప్పుల మోతాదులో తాగితే అనేక లాభాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**గుండె ఆరోగ్యానికి..**

మల్లె పువ్వుల టీలో ఉండే పాలిఫినాల్స్ శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. ఇవి మన శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించడంలో సహాయ పడతాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. వృద్ధాప్యం రాకుండా అరికట్టవచ్చు. ముఖంపై ఉండే ముడతలు పోతాయి. చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తారు. అలాగే గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. మల్లె పువ్వుల టీని సేవిస్తుంటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. బీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**మానసిక ప్రశాంతతకు..**


మల్లె పువ్వుల టీలో కెఫీన్, కాటెకిన్స్ అనే సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ టీని రోజూ రెండు కప్పులు తాగితే మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనే ప్రణాళికలో ఉన్నవారు మల్లెపువ్వుల టీని సేవిస్తుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ టీని సేవించడం వల్ల మనకు ఎల్-థియానైన్ అనే సమ్మేళనం లభిస్తుంది. ఇది మానసిక ప్రశాంతతను అందిస్తుంది. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్‌ను తగ్గిస్తుంది. దీంతో మైండ్ రిలాక్స్ అవుతుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు.

**జీర్ణ వ్యవస్థకు..**

మల్లె పువ్వుల టీలో సహజసిద్ధమైన యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల జీర్ణ వ్యవస్థలో ఉండే చెడు బ్యాక్టీరియా పోయి మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల అజీర్తి, కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మల్లె పువ్వుల టీలో ఉండే కాటెకిన్స్ నోటిని ఆరోగ్యంగా ఉంచుతాయి. నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. ఈ టీని సేవించడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని సైంటిస్టుల పరిశోధనల్లో తేలింది. ఈ టీని రోజూ సేవిస్తుంటే క్యాన్సర్ కణాలు నాశనం అవుతాయి. దీంతో క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చు. ఇలా మల్లె పువ్వుల టీతో అనేక లాభాలను పొందవచ్చు.

## గ్యాస్ ట్రబుల్ సమస్యకు మీ ఇంట్లోనే పరిష్కారం..

# మెడిసిన్లను వాడాల్సిన పనిలేదు



గ్యాస్ ట్రబుల్ సమస్య సహజంగానే చాలా మందికి ఉంటుంది. గ్యాస్ రావడం అన్నది ఎవరికైనా సాధారణమే. కొందరికి నోట్లో నుంచి త్రేన్పుల రూపంలో గ్యాస్ బయటకు పోతుంది. కొందరికి వెనుక నుంచి గ్యాస్ వస్తుంది. అయితే రోజంతా గ్యాస్ వస్తూనే ఉంటే మాత్రం చాలా ఇబ్బంది అనిపిస్తుంది. ఏ పని చేయాలనిపించదు. గ్యాస్ ట్రబుల్ సమస్య వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. సరైన టైముకు భోజనం చేయకపోవడం, అతిగా తినడం, రాత్రి పూట ఆలస్యంగా తినడం, ఎక్కువ సేపు మేల్కొని ఉండడం, ఉదయం ఆలస్యంగా నిద్రలేవడం, గంటల తరబడి కూర్చుని పనిచేస్తూ ఉండడం, శీతల పానీయాలను అధికంగా సేవించడం, కారం, మసాలాలు ఉండే ఆహారాలను అధికంగా తినడం, పలు రకాల మందులను వాడడం వల్ల కూడా గ్యాస్ సమస్య వస్తుంది.

**అల్లం..**

గ్యాస్ సమస్య ఉన్నవారికి అల్లం అద్భుతంగా పనిచేస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌లు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అల్లంలో యాంటీ స్పాస్మోడిక్ గుణాలు ఉంటాయి. ఇది పేగుల కండరాలను ప్రశాంత పరుస్తుంది. గ్యాస్ సులభంగా బయటకు వెళ్లేలా చేస్తుంది. చిన్న అల్లం ముక్కను భోజనం చేసిన అనంతరం తింటుండాలి. లేదా భోజనానికి ముందు 1 టీస్పూన్ మోతాదులో అల్లం రసం సేవించవచ్చు. భోజనం అనంతరం చిన్న అల్లం ముక్కను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. ఇలా అల్లాన్ని తీసుకున్నా కూడా గ్యాస్ సమస్య తగ్గిపోతుంది.

**వాము..**

వాములో శక్తివంతమైన కార్మినేటివ్ గుణాలు ఉంటాయి. ఈ గింజల్లో థైమోల్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది. కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. భోజనం చేసిన అనంతరం ఒక టీస్పూన్ వాము గింజలను కాస్త నల్ల ఉప్పుతో కలిపి నేరుగా అలాగే తిని ఒక గ్లాస్ గోరు వెచ్చని నీళ్లను తాగాలి. లేదా వాము గింజలను వేసి మరిగించిన నీళ్లను కూడా తాగవచ్చు. దీంతో సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.

**ఇంగువ..**

మనం వంటల్లో వాడే ఇంగువ గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది. ఇందులో యాంటీ ఫ్లాటులెంట్ గుణాలు ఉంటాయి. ఇంగువను కొద్దిగా తీసుకుని ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి తాగాలి. లేదా మీరు చేసే కూరల్లో ఇంగువను వేస్తుండాలి. దీంతో గ్యాస్ రాకుండా అడ్డుకోవచ్చు. లేదా పుదీనా ఆకులను నేరుగా నమిలి తినవచ్చు. భోజనం చేసిన అనంతరం ఒక లవంగాన్ని నోట్లో వేసుకుని నమిలి తినాలి. ఇది కూడా ఆహారం జీర్ణం అయ్యేలా చేస్తుంది. గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది.

# బికినీలో.. మన్మథుడు అన్షు అందాల విందు

'తాగితే కదా.. నచ్చుతుందో లేదో తెలిసేది... అంటూ మన్మథుడు సినిమాలో మృదు మధుర స్వరం, అమాయకత్వంతో ఆకట్టుకున్న అన్షు ఇప్పుడు మాత్రం సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో గ్లామర్ షోతో నెట్టింట రచ్చ చేస్తోంది. రెండు దశాబ్దాల క్రితం నాగార్జున మన్మథుడు సినిమాతో ఎంట్రీ ఇచ్చి చేసిన రెండు మూడు సినిమాలతోనే స్టార్ హీరోయిన్ స్టేటస్ తెచ్చుకున్న ఈ నటి ఆ చిత్రం తర్వాత ప్రభాస్‌తో రాఘవేంద్ర, తమిళంతో ప్రశాంతో ఓ సినిమా తెలుగులో గెస్ట్ పాత్రల్లో మాత్రమే నటించిన ఈ ముద్దుగుమ్మ ఆపై రీర్ ఊపందుకుంటున్న సమయంలోనే పెళ్లి చేసుకుని విదేశాలకు వెళ్లి పోయింది. ఇటీవల సందీప్ కిషన్, రావు రమేశ్ మజాకాతో తిరిగి సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చింది. కానీ మూవీ అంతగా విజయవంతం కాకపోవడంతో ఏవైనా ఛాన్సులు వస్తే వస్తా అన్నట్లు విదేశాలకు తిరిగి వెళ్లిపోయింది. అయితే పెళ్లై ఇద్దరు పిల్లలున్నా ఈ అమ్మడు సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్స్‌ను సంపాదించుకుంది. తాజాగా తన భర్త , పిల్లలతో కలిసి దుబాయ్ ట్రిప్‌కు వెళ్లిన ఈ భామ అక్కడ ఓ ఖరీదైన హెూటల్‌లో బస చేసి, స్విమ్మింగ్ పూల్‌లో సేద తీరుతూ అందాలు ఆరబోస్తూ అభిమానులకు సడన్ షాక్ ఇచ్చింది. ఆ ఫొటోలు చూసిన వారంతా అన్షును ఇంత హాట్‌గా ఎన్నడూ చూడలేదంటు కామెంట్లు చేస్తున్నారు. సినిమాల్లోనూ ఎప్పుడూ అందాల ప్రదర్శణ చేయని ఈ బ్యూటీ ఇప్పుడేంటీ ఇంతగా గ్లామర్ ట్రీట్ ఇస్తుందంటూ అనుకుంటున్నారు.








## క్లీవేజ్ అందాలతో విష్ణు ప్రియ రచ్చ

# సెన్సార్ పూర్తి చేసుకున్న 'మై బేబీ' జూలై 18న గ్రాండ్ రిలీజ్

ఇటీవల తమిళంలో విడుదలై భారీ విజయం సాధించిన 'డి.ఎన్.ఎ' చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాత సురేష్ కొండేటి ఈ చిత్రాన్ని 'మై బేబి' పేరుతో ఈనెల జూలై 18న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మూవీ సెన్సార్‌ను పూర్తి చేసుకుంది. గతంలో 'ప్రేమిస్తే', 'జర్నీ', 'షాపింగ్ మాల్', 'పిజ్జా' వంటి 15 విజయవంతమైన చిత్రాలను నిర్మాతగా అందించిన సురేష్ కొండేటి, డిస్ట్రిబ్యూటర్‌గా 85కు పైగా సినిమాలను విడుదల చేశారు. 'మై బేబి' ఆయన నిర్మాణంలో వస్తున్న 16వ చిత్రం. ఈ సినిమా కూడా భారీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అధర్వ మురళి మరియు నిమిషా సజయన్ జంటగా నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రానికి నెల్సన్ వెంకటేసన్ దర్శకత్వం వహించారు. 2014లో ఒక సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ జీవితంలో జరిగిన ఒక దుర్ఘటన ఆధారంగా ఈ కథ రూపొందిందని చిత్ర బృందం తెలిపింది. గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో కూడిన భావోద్వేగభరితమైన కథాంశం ఈ సినిమా ప్రత్యేకత అని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని ఎస్.కె. పిక్చర్స్ ద్వారా విడుదల చేయనున్నారు. సాయి చరణ్ తేజ పుల్లా, దుప్పటి గట్టు సారిక రెడ్డి ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా వ్యవహరించారు.






# బిగ్‌బాస్ షోలో ఛాన్స్ వస్తే వెళ్తారా? పీలింగ్స్ సింగర్ ఆన్సరిదే!

అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప 2 మూవీలో వస్తుండాయి పీలింగ్స్ పాట ఎంత సెన్సేషన్ అయిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ పాట కోసం సినిమా ఇండస్ట్రీలోని టాప్ సింగర్స్‌ను కాదని జానపద గాయని దాస లక్ష్మితో పాడించారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం గన్నోర గ్రామానికి చెందిన లక్ష్మి చిన్నప్పటినుంచే ఫోక్ సాంగ్స్ పాడుతుండేది. పలు పాటల ప్రోగ్రామ్స్‌లోనూ పాల్గొనేది. యూట్యూబ్ వల్ల లక్ష్మి చాలా పాపులర్ అయింది.

**పుష్ప 2లో ఛాన్స్**

తిన్నా తీరం పడుతలే.. కూసున్నా తీరం పడుతలే.., ఆనాడేమన్నంటినా తిరుపతి.. నిన్ను ఈనాడేమన్నంటినా తిరుపతి వంటి పాటలు ఆమెకు బోలెడంత పేరు తెచ్చిపెట్టాయి. ఇంకేముంది, దర్శకుడు సుకుమార్, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్.. లక్ష్మి టాలెంట్ గురించి తెలుసుకుని వెంటనే పుష్ప 2లో ఛాన్స్ ఇచ్చారు. అలా ఆమె వస్తుండాయి పీలింగ్స్ పాట పాడింది. అంతకుముందు బ్యాచ్ మూవీలో ఓ పాట, దసరాలో ధూమ్ ధామ్ దోస్తాన్ సాంగ్ పాడింది.

**బిగ్‌బాస్ నుంచి ఆఫర్ వస్తే..**

బిగ్‌బాస్ షోలో ఛాన్స్ వస్తే వెళ్తారా? అన్న ప్రశ్నకు లక్ష్మి తాజాగా ఇలా స్పందించింది. బిగ్‌బాస్ షోకి వెళ్లాలన్న ఆలోచనే రాలేదు. ఎందుకంటే నా భర్త, ఏడాదిన్నర పిల్లాడే నా ప్రపంచం. వారిని విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్లలేను. బాబు ఇంకా చిన్నవాడు కాబట్టి దుబాయ్, మస్కట్ వంటి దేశాల్లో మూడు, నాలుగు రోజుల ప్రోగ్రామ్స్ ఉంటేనే వెళ్లలేకపోతున్నాను. నేను బిగ్‌బాస్ షో చూస్తూ ఉంటాను. ఒకవేళ ఛాన్స్ వస్తే వెళ్లడానికి ప్రయత్నిస్తాను అని లక్ష్మి చెప్పుకొచ్చింది.



# శ్రీకృష్ణ దేవరాయ బయోపిక్‌లో రిషబ్ శెట్టి?

కాంతార సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటుడు రిషబ్‌శెట్టి ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్‌లను ఓకే చేస్తున్నాడు. ఇప్పటికే కాంతార ప్రీక్వెల్‌ను తెరకెక్కిస్తున్న రిషబ్ మరోవైపు మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ పాత్రలో రాబోతున్న ఒక సినిమాలో నటించబోతున్నాడు. అయితే ఈ రెండు ప్రాజెక్ట్‌లే కాకుండా మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను రిషబ్ శెట్టి చేయబోతున్నట్లు తెలుస్తుంది. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అశుతోష్ గోవారికర్‌తో కలిసి రిషబ్ ఒక భారీ చారిత్రక చిత్రంలో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆంధ్ర భోజుడు, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కబోతుంది. కాగా దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. "పానిపట్", "జోధా అక్బర్", "మొహెంజోదారో", "లగాన్" వంటి హిస్టారికల్ చిత్రాలను తెరకెక్కించిన అశుతోష్ గోవారికర్ శ్రీకృష్ణదేవరాయలు బయోపిక్ తీస్తున్నట్లు వార్తలు వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com